Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 259 మేడ్చల్ మల్కాజ్‌గిరి 8 అక్టోబర్ 2023 ఆదివారం పేజీలు : 4

## 'ఇండియా' కూటమి నిజమైన సవాలే

### అంగీకరించిన కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ: విపక్ష ఇండియా కూటమి తమకు నిజమైన సవాలని కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మూడో సారి కూడా దేశానికి సేవలందించాలన్నదే బీజేపీ అజెండా అని చెప్పారు. పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో మంత్రి మాట్లాడుతూ, ఏ ఎన్నికలను కూడా బీజేపీ తేలిగ్గా తీసుకోదని, ఆ కారణంగానే 'ఇండియా' బ్లాక్‌ను ప్రధాన సవాలుగా తాను భావిస్తున్నానని చెప్పారు. ఎన్నికలు ఏవైనా బీజేపీ కింది స్థాయి కార్యకర్తల నుంచి అగ్రనేతల వరకూ ప్రతి ఒక్కరూ చాలా సీరియస్‌గా తీసుకుని పనిచేస్తారని, ప్రధాన మంత్రి మోదీ తమను ముందుండి నడిపిస్తుంటారని తెలిపారు.

# ఇటు కేటీఆర్.. అటు హరీష్ రావు

## రాష్ట్రాన్ని చుట్టేస్తున్నారుగా...!



హైదరాబాద్ : తెలంగాణలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో అధికార బీఆర్ఎస్ దూకుడు పెంచింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ డెవలప్మెంట్, సంక్షేమ పథకాల కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కానీ రాష్ట్రంలో ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా బీఆర్ఎస్ లోని ఇద్దరు కీలక నాయకుల్లో ఒకరు కచ్చితంగా అక్కడ ఉంటున్నారు. వాళ్లలో ఒకరు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ కాగా మరొకరు మంత్రి హరీష్ రావు. బీఆర్ఎస్కు ప్రధాన స్థంభాలైన ఈ ఇద్దరు నేతలు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రచారాన్ని ఇప్పటి నుంచే హోరెత్తిస్తున్నారు. తాజాగా సిరిసిల్లా జిల్లా గంభీరావు పేట మండలంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పత్రాలను కేటీఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ కాంగ్రెస్ పై విమర్శలు చేశారు. మరోవైపు హైదరాబాద్లో కూడా పలు అభివృద్ధి కార్యక్రమాలలో కేటీఆర్ పాల్గొంటూ వస్తున్నారు. ఇక్కడ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న డెవలప్మెంట్, సంక్షేమ పథకాల గురించి చెప్పారు. మొన్నటికి మొన్న నిజామాబాద్ పర్యటనకు వెళ్లి కామారెడ్డి జిల్లాను కూడా కవర్ చేసి వచ్చారు. మరోవైపు ఇతర జిల్లాల్లో ఏ కార్యక్రమం ఉన్నా కేటీఆర్ వెళ్తున్నారు. మరోవైపు మంత్రి హరీష్ రావు కూడా ఫుల్ యాక్టివ్ అయ్యారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలు చుట్టేస్తున్నారు. తాజాగా వికారాబాద్ జిల్లా తాండూరులో పలు డెవలప్మెంట్ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీలపై తీవ్ర విమర్శలు చేశారు. గవర్నర్ను అడ్డుపెట్టుకుని బీజేపీ రాష్ట్రంలో దిగజారుడు రాజకీయాలు చేస్తోందని హరీష్ ఆరోపించారు. మొత్తానికి బావ బావమరదులు కలిసి ఇటు ప్రచారంతో పాటు అటు ప్రత్యర్థి పార్టీలపై విమర్శలతో దూకుడు కొనసాగిస్తున్నారనే చెప్పాలి. ప్రతి కార్యక్రమానికి కేసీఆర్ బయటకు వచ్చే ఆస్కారమే లేదు. దీంతో పార్టీలో కీలకంగా మారిన కేటీఆర్, హరీష్ లో ఒకరిని తమ జిల్లాలకు బీఆర్ఎస్ నేతలు ఆహ్వానిస్తున్నారు. ఈ నాయకులు వస్తే ప్రజల్లో తమ పాపులారిటీ మరింత పెరుగుతుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు.

## ఈనెల 16న బీఆర్ఎస్ మేనిఫేస్టో ప్రకటన..!




హైదరాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణలో ప్రధాన పార్టీలు తమ కార్యాచరణ మరింత ముమ్మరం చేశాయి. మేనిఫేస్టోలతో ప్రజలను ఆకర్షించేందుకు అన్ని పార్టీలు కసరత్తు మొదలుపెట్టాయి. ఆరు గ్యారంటీ స్కీమ్‌ల పేరుతో కాంగ్రెస్ ఇప్పటికే మినీ మేనిఫేస్టో ప్రకటించగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సయితం మేనిఫేస్టో ప్రకటనకు ముహూర్తం ఫిక్స్ చేశారు.

ఇప్పటికే మేనిఫేస్టో కమిటీలను పార్టీలు ప్రకటించాయి. పదేళ్లు పాలించినవారికి మేనిఫేస్టోలతో పనేంటని కాంగ్రెస్ నేతలు సెటైర్లు వేస్తుంటే... ఈనెల 16న మేనిఫేస్టో ప్రకటనకు ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్ధమవుతున్నారు. ఇక కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల్లో మంచి స్పందన రావడంతో ఆ పార్టీ నేతలు ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఈనెల 16న వరంగల్‌లో బీఆర్ఎస్ భారీ బహిరగ సభ ఏర్పాటు చేస్తోంది. ఈ సభలోనే మేనిఫేస్టోను సీఎం కేసీఆర్ విడుదల చేస్తారని సమాచారం.

రైతు బంధు పెంపు, రైతులకు ఫించన్లు, మహిళలను ఆకట్టుకునేందుకు పథకాలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అటు యువతను ఆకట్టుకునేందుకు కూడా ప్రదాన పార్టీలు సిద్ధమవుతున్నాయి.

## బీఆర్ఎస్ ట్రాప్‌లో కాంగ్రెస్ పడుతుందా?




హైదరాబాద్ : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ జోరు మీదుంది. రాష్ట్రంలో పార్టీకి ఏర్పడుతున్న సానుకూల పరిస్థితులను విజయానికి మెట్లుగా మార్చుకోవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ఉంది. అందుకే ప్రచారంలోనూ దూకుడు చూపిస్తోంది. మరోవైపు చేరికలను భారీగా ప్రోత్సహిస్తోంది. ఇతర పార్టీల నుంచి వచ్చే నాయకులను చేర్చుకుంటోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి వచ్చే నేతలను ఎలాంటి సందేహాలు లేకుండా కండువాలు కప్పి ఆహ్వానిస్తోంది. కానీ ఇదే ఇప్పుడు పార్టీకి నష్టం చేస్తుందా? అనే ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి వచ్చే నేతలకు ప్రాధాన్యతనిస్తున్న కాంగ్రెస్.. బీఆర్ఎస్ ట్రాప్ లో పడుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో అధికార బీఆర్ఎస్ తర్వాతి స్థానంలో కాంగ్రెస్ ఉంది. ఆ పార్టీలో అగ్ర నేతలకు కొదవలేదు. మరోవైపు బీఆర్ఎస్ నుంచి వచ్చే నాయకులను చేర్చుకుంటోంది. పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి క్రిష్ణారావు, తుమ్మల నాగేశ్వర రావు, మైనంపల్లి హన్మంత రావు, వేముల వీరేశం లాంటి నేతలు ఇప్పటికే కాంగ్రెస్ లో చేరిపోయారు. మోత్కుపల్లి నర్సింహులు తదితర బీఆర్ఎస్ నాయకులు కూడా త్వరలోనే హస్తం గూటికి వెళ్లనున్నారు. రాబోయే రోజుల్లో ఈ చేరికలు ఇంకా కొనసాగే అవకాశం ఉంది. ఇప్పటివరకూ అంతా బాగానే ఉంది. కానీ.. అసలు సమస్య ఇప్పుడే మొదలవనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ లో ప్రాధాన్యత దక్కడం లేదని, టికెట్ రాలేదనే నిరాశతో చాలా మంది నాయకులు కాంగ్రెస్ లో చేరుతున్నారు. అలాంటి నాయకులకు టికెట్లు కేటాయించడం ఇప్పుడు కాంగ్రెస్ కు తలనొప్పిగా మారింది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన నేతల కోసం తమను పక్కనపెట్టడంపై కాంగ్రెస్ నాయకులు మండిపడుతున్నారని తెలిసింది. బయట నుంచి వచ్చిన వారి కోసం తమ నియోజకవర్గాలను త్యాగం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ లోనే టికెట్ల మధ్య హోరాహోరీ పోటీ ఉంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు మధ్యలో వచ్చి.. ఆధిపత్యం చలాయించడం ఏమిటని కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలు చూస్తుంటే బీఆర్ఎస్ ట్రాప్ లో కాంగ్రెస్ పడుతుందనే అభిప్రాయాలున్నాయి. తమ పార్టీ నుంచి వెళ్లే నాయకుల వల్ల కాంగ్రెస్ లో అంతర్గత విభేధాలు తారస్థాయికి చేరతాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు తెలియంది కాదు. దీనివల్ల అంతిమంగా లబ్ధి పొందేది కేసీఆర్ అని విశ్లేషకులు చెబుతున్నారు.

# తెలంగాణ కోసం...

# కృష్ణావివాదాన్ని కెలికిన మోడీ

## ఎన్నికల వేళ జగన్ సర్కార్ పై తీవ్ర ఒత్తిడి ?



హైదరాబాద్ / అమరావతి : ఏపీని రెండు రాష్ట్రాలుగా విభజించి ఇప్పటికీ పంపకాలు పూర్తి చేయని కేంద్రం.. కృష్ణాజలాల వివాదాన్ని కెలకడం ద్వారా తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఎన్నికల వేళ తెలంగాణలో ఛాంపియన్ గా నిలిచేందుకు కృష్ణా ట్రైబ్యునల్ కు జీవం పోయాలన్న కేంద్రం వ్యూహాలు ఇప్పుడు ఏపీకి నిద్రలేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా కృష్ణా నదీ జలాల పంపకాన్ని తిరిగి చేపట్టాలన్న నిర్ణయంపై ఏపీలో ఆగ్రహ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. కృష్ణాజలాల పునఃపంపిణీ కోసం బ్రిజేష్ కుమార్ కు కేంద్రం తాజాగా మార్గదర్శకాలు జారీ చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో గతంలో ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీలతో పాటు దానికి అతీతంగా కేటాయించిన మిగులు జలాలు, పోలవరం ప్రాజెక్టు ద్వారా కృష్ణాకు తరలించడానికి వీలుగా గోదావరి ట్రైబ్యునల్ సమైక్య రాష్ట్రానికి కేటాయించిన జలాల వాటాను రెండు రాష్ట్రాలకు పంచేలా ఈ మార్గదర్శకాలు ఉన్నాయి. దీనిపై ఏపీలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీంతో ఏపీ ప్రజల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని తదుపరి చర్యలు నిలిపేయాలని ప్రధాని మోడీకి సీఎం జగన్ లేఖ కూడా రాశారు.

వాస్తవానికి ఉమ్మడి ఏపీ విభజన తర్వాత కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కేటాయించిన జలాల్ని అంగీకరించని తెలంగాణ అప్పటి నుంచి పోరాటం చేస్తూనే ఉంది. ఇప్పుడు తెలంగాణ ఎన్నికల వేళ తిరిగి ఆ అంశాన్ని కెలికి లబ్ధి పొందాలని కేంద్రం భావిస్తోంది. దీంతో పునఃపంపకాల డిమాండ్ ను అంగీకరించి బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ కు మార్గదర్శకాలు జారీ చేసింది. ఇదంతా అంతిమంగా ఏపీకి నష్టం చేసేలా ఉందని రైతులు మండిపడుతున్నారు.

ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని దీన్ని అడ్డుకోవాలనే ఒత్తిడి పెరుగుతోంది. తెలంగాణ ఎన్నికల కోసం కృష్ణాజలాల అంశాన్ని కెలికిన కేంద్రం..ఆ తర్వాత ఏపీ ఎన్నికలకు ఏం చేయబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. ఏపీతో పోలిస్తే తెలంగాణలో కాస్తో కూస్తో సీట్లు వచ్చే అవకాశం ఉండటంతో కృష్ణా జలాల విషయంలో కేంద్రం దూకుడుగా ముందుకెళ్తోంది. అయితే ఇది అంతిమంగా బీఆర్ఎస్ కే లబ్ధి చేకూర్చే అవకాశం ఉంది. కానీ ఏపీ పరిస్థితి మాత్రం దారుణంగా మారబోతోంది. కేంద్రం చర్యలతో ఏపీకి భవిష్యత్తులో తీవ్రంగా నష్టం జరిగే ప్రమాదముందన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటికే కేంద్రం చేస్తున్న వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణను అడ్డుకోలేకపోయారన్న విమర్శలు ఎదుర్కొంటున్న జగన్ సర్కార్ కు వచ్చే ఎన్నికల్లో కృష్ణాజలాల పునఃపంపకాల వ్యవహారం కూడా మెడకు చుట్టుకోబోతోంది.

## సంపాదకీయం

# తండ్రి రాజీవ్ గాంధీ అలా... కొడుకు రాహుల్ గాంధీ ఇలా...!

ఇప్పటికి సరిగ్గా 33 ఏళ్ళ క్రితం అంటే 1990 ప్రాంతంలో లోక్ సభలో నాటి కాంగ్రెస్ పార్టీకి చెందిన విపక్ష నేత, మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ కుల ప్రాతిపదికన విభజన చేస్తే దేశం మొత్తం విచ్ఛిన్నం అయిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వ్యక్తి అంటే నాటి ప్రధాని వీపీ సింగ్ మొండితనం నుంచి ఈ దేశాన్ని కాపాడాలని ఆయన గట్టిగా కోరుకున్నారు. ఇదంతా మండల్ కమిషన్ మీద నాడు పార్లమెంట్ లో చర్చ సందర్భంగా రాజీవ్ గాంధీ సుదీర్ఘంగా ప్రసంగిస్తూ చేసిన కీలక కామెంట్స్. కులాల ప్రాతిపదికన విభజన ఎంతమాత్రం దేశానికి మంచిది కాదని రాజీవ్ గాంధీ గట్టిగా వాదించారు. అదే విధంగా కుల ప్రాతిపదికన రాజకీయ నియోజక వర్గాలను ఏర్పాటు చేయాలనే మండల్ కమిషన్ అభిప్రాయానికి ప్రభుత్వం విలువ ఇస్తుందా అని ప్రశ్నించారు. ఇదంతా మన దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి రూపొందించబడిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల రహిత సమాజాన్ని నమ్ముతున్నారో లేదో చెప్పే దమ్మూ ధైర్యం ప్రధాని వీపీ సింగ్ కి లేదని రాజీవ్ గాంధీ దుయ్యబెట్టారు. రాజా సాహిబ్ మరోసారి మన సమాజంలో కులాన్ని ప్రవేశపెడుతున్నారని, ఈ చర్య ద్వారా కులం బయటకు పోకుండా దేశంలోనే ఉంటుందని రాజీవ్ గాంధీ వీపీ సింగ్ మీద ఘాటైన విమర్శలు చేశారు. పాలకులు వేసే ప్రతీ అడుగూ కుల రహిత సమాజం వైపు వెళ్లేలా ఉండాలని ఆన కోరుకున్నారు. దురదృష్టవశాత్తు ఈరోజు మనం వేస్తున్న అడుగు మన విధానం కులతత్వ సూత్రంతో ఉందని ఆయన నేషనల్ ఫ్రంట్ పాలకుల తీరు మీద మండిపడ్డారు. జాతీయ లక్ష్యంలో భాగం కావాల్సిన అతి ముఖ్య అంశం కులరహిత సమాజం అని రాజీవ్ గాంధీ వాదించారు. రాజ్యాంగం షెడ్యూల్డ్ కులాలు వెనుకబడిన తరగతుల మధ్య చాలా స్పష్టంగా వేరు చేసిందని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగ నిర్మాతలు ఈ వ్యత్యాసాన్ని ఎందుకు చేశారన్నది ఆలోచించాలని ఆ వ్యత్యాసాన్ని కోల్పోరాదని రాజీవ్ అన్నారు. భారత దేశంలో కులాల సంఖ్య చాలా ఎక్కువని ఆయన అంటూ అయినా సరే అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ లక్ష్యం కుల రహిత సమాజంగా ఉండాలని రాజీవ్ కోరుకున్నారు. మండల్ కమిషన్‌ను అమలు చేసిన తీరు నా దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందని నా దేశం విడిపోవడం తనకు ఇష్టం లేదని రాజీవ్ అన్నారు. ఇదంతా రాజీవ్ గాంధీకి దేశంలో ఉన్న కులాల మీద ఉన్న భావన. ఆయన కులాలను గౌరవించమని అంటున్నారు. దాని కంటే ముందు మూలాలలోకి వెళ్లి పేదరికాన్ని తొలగించమని కోరారు మరి ఇన్నేళ్ళ తరువాత అదే కాంగ్రెస్ పార్టీ అదే రాజీవ్ గాంధీ రాజకీయ వారసుడు రాహుల్ గాంధీ అంటున్నదేంటి అన్నది చూస్తే దేశవ్యాప్తంగా కుల గణన చేయమని అంటున్నారు. ఈ దేశంలో కుల గణన చేపట్టాలని లేకపోతే తమ ప్రభుత్వం వచ్చి ఆ పని చేస్తుంది అని అంటున్నారు. మరి తండ్రి రాజీవ్ గాంధీ ఆలోచనలను రాహుల్ అనుసరించడం లేదా అనన్ చర్చ ఈ సందర్భంగా వస్తుంది. నాడు రాజీవ్ గాంధీ మండల్ కమిషన్ పేరిట రాజకీయ ప్రయోజనాల కోసం వీపీ సింగ్ నాయకత్వాన జనతాదళ్ చేస్తున్న కుట్రను తిప్పికొట్టారు. ఇపుడు సరిగ్గా అవే మాటలను ప్రధాని నరేంద్ర మోడీ కూడా అంటున్నారు. కుల గణన వల్ల దేశంలో విచ్ఛిన్నరకర పరిస్థితులు ఏర్పడుతాయని రాజీవ్ మాటలను మోడీ వల్లె వేస్తున్నారు. మరి రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ కుల గణన డిమాండ్ ని నెత్తికెత్తుకుంది. ఇదంతా ఎందుకు అంటే ఈ రోజున దేశంలో సనాతన ధర్మం మీద ఒక చర్చ నడుస్తోంది. దాన్ని తట్టి లేపిన వారు తమిళనాడు మంత్రి ఉదయ నిధి. డీఎంకే ఇండియా కూటమిలో ఉంది. ఇక సనాతన ధర్మాన్ని వెనకేసుకుని వచ్చి భారీగా రాజకీయ లబ్దిని పొందేందుకు బీజేపీ వ్యూహ రచన చేస్తోంది. దాన్ని అడ్డుకోవడం కోసం లేదా ఆ చర్చను పూర్తిగా డైవర్ట్ చేయడం కోసం కుల గణనను ముందుకు తెచ్చారని అంటున్నారు. అంతే కాదు 2024 జనవరి లో రామమందిరం ప్రారంభం కాబోతోంది. మందిర్ రాజకీయాలు ఎటూ బీజేపీకి మేలు చేస్తాయని అంటారు. దాంతో దాన్ని కూడా అడ్డుకోవాలని ఇండియా కూటమి నేతలు కులగణన డిమాండ్ ని అందుకున్నారని అంటున్నారు. అంటే మతంతో ఏకీకృతం గా ఓటు బ్యాంక్ బీజేపీకి పోకుండా కుల గణన పేరుతో చెక్ పెడితే తమకు రాజకీయ లాభం అన్నదే ఇండియా కూటమి ఆలోచనలు అని అంటున్నారు. రాజకీయల సంగతి వ్యూహాల విషయం ఎలా ఉన్నా నాడు మండల్ కమిషన్ ని తీవ్రంగా వ్యతిరేకించి కుల రాజకీయం వద్దు అని చెప్పిన రాజీవ్ గాంధీ బాటన కాంగ్రెస్ ఎందుకు నడవడం లేదు అని బీజేపీ నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. అదే టైంలో రాహుల్ గాంధీ తన తండ్రి చెప్పిన మాటలను విని ఆయన బాటను అనుసరిస్తున్నారా అన్నది మరో చర్చగా ఉంది. ఇక న్యూట్రల్ వాదంగా చెప్పుకోవాలీ అంటే అందరికీ అతి పెద్ద కులం ఒకటి ఉంది అదే పేదరికం. దాన్ని రూపుమాపే చర్యలకు దిగాలి కానీ కుల విభజన పేరుతో ఏడున్నర దశాబ్దాల తరువాత కూడా చిచ్చు రేపుతూ ముందుకు పోతే రేపటి రోజున కులాలను అడ్డం పెట్టుకుని విభజనలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన చెందేవారూ ఉన్నారు.

# ఆగని ఇసుక అక్రమ రవాణా



తంగళ్లపల్లి : ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. కొందరు అక్రమార్కులు అదను చూసి ఇష్టారాజ్యంగా తరలిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. స్థానిక అవసరాల పేరుతో కొందరు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తుండగా, మరికొందరు రాత్రి వేళ అడ్డూ అదుపూ లేకుండా మానేరు వాగు నుంచి తోడేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక అవసరాల పేరిట అనుమతి తీసుకొని ఇసుక స్మగ్లర్లు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ జిల్లా సరిహద్దు గ్రామాల్లో డంపు చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రి వేళల్లో సిద్దిపేట, మెదక్, హైదరాబాద్ వంటి పట్టణాలకు తరలిస్తూ దందాను కొనసాగిస్తున్నారు. ప్రధానంగా తంగళ్లపల్లి మండల కేంద్రంతో పాటు మండెపల్లి, రాళ్లపేట, కస్బెకట్కూర్, గండిలచ్చపేట గ్రామాల శివారులోని మానేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ కొందరు జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. మరి కొందరు ఇళ్ల వద్దనే డంపు చేసి అక్కడి నుంచి గుట్టుచప్పుడు కాకుండా వాహనాల్లో తరలిస్తున్నారు.

**గ్రామాల్లో లాభసాటి వ్యాపారంగా..**

ఇసుక లాభసాటి వ్యాపారంగా మారడంతో అక్రమార్కులు మానేరువాగు నుంచి తరలిస్తూ గ్రామ శివారుల్లో ఓ చోట డంపు చేస్తున్నారు. సుమారు 15- 20 కిలో మీటర్ల దూరం ఇసుక తరలింపునకు కూలీలు, డీజిల్‌కు ఒక్కో ట్రిప్పునకు రూ. 400 నుంచి రూ. 700ల వరకు ఖర్చు అవుతుంది. టిప్పర్ యజమానులు ఒక్కో టిప్పు ఇసుకను రూ. 1500ల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఖర్చులు పోనూ ట్రిప్పునకు రూ. 700ల వరకు లాభం రావడంతో గ్రామాల్లో ఎక్కువగా దీనిని వ్యాపారంగా మార్చుకుంటున్నారు. టిప్పరు యజమానులు అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**వేబిల్లులు తీసుకొని..**

స్థానిక అవసరాల పేరిట వేబిల్లులు తీసుకొని సూచించిన స్థానంలో ఇసుకను పోయకుండా జిల్లా సరిహద్దు గ్రామాలైన జిల్లెల్ల, రామచంద్రాపూర్, మల్లాపూర్, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో డంపు చేస్తున్నారు. అక్కడి నుంచి సిద్దిపేట, మెదక్, హైదరాబాద్ వంటి పట్టణాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు వారంలో రెండు సార్లు అంటే బుధ, శనివారాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇసుక రవాణాకు అనుమతి ఇస్తున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు యథేచ్ఛగా తెల్లవారుజాము నుంచే ఇసుకను తరలిస్తూ జిల్లా సరిహద్దు గ్రామాల శివారుల్లో నిల్వ చేస్తున్నారు.

**అతి వేగం.. మైనర్లతో డ్రైవింగ్**

స్థానిక అవసరాల పేరిట అనుమతి తీసుకొని మానేరు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్లు అతి వేగంగా ప్రధాన రోడ్డుపై వెళ్తున్నారు. దీంతో ఇతర వాహనదారులు, గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. యువకులు కొందరు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నిర్లక్ష్యంగా వాహనాలను నడపడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు సైతం పోయిన సంఘటనలు ఉన్నాయి. మరికొందరు మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఇసుకకు అనుమతులు ఇచ్చిన రోజు రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టినట్లయితే కొంత మేరకు ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**చట్టపరమైన చర్యలు తీసుకుంటాం- సదానందం, తహసీల్దార్, తంగళ్లపల్లి**

స్థానిక అవసరాలకు మాత్రమే అనుమతులు ఇస్తున్నాం. అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించినట్లు మా దృష్టికి రాలేదు. రాత్రి వేళల్లో రవాణా చేయకుండా నిఘా ఏర్పాటు చేస్తాం. అక్రమంగా తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# గోదావరి జలం.. పంటలకు ప్రాణం



గంగాధర : యాసంగి సీజన్‌లో అదను దాటినప్పటికీ ఎల్లంపల్లి ప్రాజెక్టు (గోదావరి) జలాలు విడుదల చేయడంతో పంటలకు ప్రాణధారగా నిలిచాయి. ఉమ్మడి జిల్లాలోని రైతాంగానికి ఎల్లంపల్లి ప్రాజెక్టు వెన్నుదన్నుగా ఉంటుండగా రైతులు రెండు పంటలు పండించుకుని కరవు జయిస్తున్నారు.

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం నుంచి రెండు పైపులైన్ల ద్వారా నారాయణపూర్ జలాశయాన్ని నింపుతారు. ఇక్కడి నుంచి చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో దాదాపు 1.60 లక్షల ఎకరాలకు నీటిని అందిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని దాదాపు 60 చెరువులు, కుంటలు నింపి ప్రధాన, ఉపకాలువల ద్వారా నీటిని పంటలకు విడుదల చేస్తున్నారు. అయితే గతేడాది భారీ వర్షాలకు వరదలతో గంగాధర, నారాయణపూర్ చెరువుల కట్టలు తెగి నీరంతా వృథాగా పోయింది. యాసంగిలో ఎల్లంపల్లి నీటి విడుదలపై సందిగ్ధం నెలకొనగా రైతులు సగం విస్తీర్ణంలో అంటే దాదాపు 80 వేల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు చేశారు. అయినప్పటికీ వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటలు ఎండిపోయాయి. 'ఈనాడు' కథనాలతో ప్రభుత్వం నారాయణపూర్ చెరువు కట్ట మరమ్మతులు పూర్తి చేసి మార్చి 10 నుంచి ఎల్లంపల్లి నీరు విడుదల చేసింది.

ఎగువ ప్రాంతాలకు ఎత్తిపోతలు షురూ..నారాయణపూర్ నుంచి ఎడమకాలువ ద్వారా గంగాధర మండలంలోని ఆయా గ్రామాలకు నీరు పంటలకు అందుతుండడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. రామడుగు మండలంలోని ఆయా గ్రామాలకు మత్తడి దూకుతూ లక్ష్మీదేవిపల్లి-నాగిరెడ్డిపూర్ వాగు ద్వారా పుష్కలంగా నీరు చేరుతోంది. ఇక నారాయణపూర్ నుంచి నాలుగు రోజులుగా కొడిమ్యాల మండలం పోతారం చెరువు నింపి ఇక్కడి నుంచి వాల్వులు విప్పి నాచుపల్లి నాగసముద్రం చెరువు నింపారు. నల్లగొండ, తిప్పాయిపల్లి, బోయినపల్లి మండలంలోని అనంతపెల్లి, కోరెం, వేములవాడ మండలం ఫాజుల్‌నగర్, శాత్రాజ్‌పల్లి, నూకలమర్రి, చందుర్తి మండలం నర్సింగాపూర్, బండపల్లి గ్రామాలకు నీటిని విడుదల చేసి పంటలకు అందించారు. ఎగువ గ్రామాల్లోని దాదాపు 40 వేల ఎకరాలకు సాగునీరు అందగా ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాగా నారాయణపూర్ చెరువు మత్తడి పదేపదే తెంపడంతో ఎగువ గ్రామాలకు నీటి విడుదలలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. నీటి విడుదలతో సరాసరిగా పంటలకు నీరు అందగా వ్యవసాయ బావుల్లో జలం పైకివచ్చింది. విద్యుత్తు వినియోగంతోపాటు నీటి వినియోగం తగ్గి రైతులకు శ్రమ తప్పినట్లయింది.

**నాలుగు ఎకరాలు దక్కాయి**

రెండు బావుల ఆధారంగా 8 ఎకరాల్లో వరి పంట వేస్తే బావుల్లో ఊటలు తగ్గి పొలం పారడం కష్టమైంది. ఇప్పటికే ఎకరన్నరలో పంటలు వేయక బీడుగా వదిలేసిన. ఎట్టకేలకు నీటి విడుదల చేయడంతో పోతున్న ప్రాణం తిరిగొచ్చినట్లయింది. లేకపోతే సగం విస్తీర్ణంలో పంటలు ఎండిపోయి పెట్టుబడులు మీద పడే ప్రమాదముంది. 15 రోజులు ముందుగా నీటిని ఇస్తే మిగతా రైతులు నష్టపోయేవారు కాదు.

కొట్టె రాజయ్య, లక్ష్మీదేవిపల్లి

**నీరు వచ్చినా.. రాళ్ల వాన ముంచింది**

ఎల్లంపల్లి నీరు విడుదలతో పంటలు పండాయనే సంతోషం కూడా వడగళ్ల వాన మిగలకుండా చేసింది. మూడు రోజులపాటు కురిసిన అకాల వర్షాలకు వరి, మొక్కజొన్న, కూరగాయలు దెబ్బతిని కోలుకోలేకపోతున్నాం. 50 శాతం నష్టం జరిగితేనే పరిహారం ఇస్తామని అధికారులు కొర్రీలు పెడుతున్నారు.

మొగిలిపాలెం అంజయ్య, నాగిరెడ్డిపూర్

# అప్రమత్తతే శ్రీరామ రక్ష

గోదావరిఖని : దేశవ్యాప్తంగా 'కరోనా' కేసుల సంఖ్య పెరుగుతుండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయి. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వారం రోజులుగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. దీంతో స్థానికుల్లో భయాందోళన వ్యక్తమవుతుండగా గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో 'కొవిడ్ ఐసోలేషన్ వార్డు' ఏర్పాటునకు చర్యలు తీసుకుంటున్నారు. కొద్ది రోజుల్లో పూర్తిస్థాయిలో ఆక్సిజన్ సదుపాయం కలిగిన కొవిడ్ ఐసోలేషన్ వార్డు సిద్ధం కానుంది. రెండు పర్యాయాలు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కరోనా కేసులు అత్యధికంగానే నమోదు కావడంతో ఆసుపత్రిలోని కొవిడ్ ఐసోలేషన్ వార్డులో అత్యాధునిక సదుపాయాలతో మెరుగైన వైద్య సేవలు అందించారు. మరోసారి రామగుండం ప్రాంతంలో కరోనా వ్యాప్తి వెలుగు చూస్తుండడంతో అప్రమత్తమైన వైద్యాధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

**వారం రోజుల్లో ముగ్గురికి..**

వారం రోజుల్లో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మూడు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. స్థానిక పరిశ్రమల్లో పని చేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు తరచూ ఆయా ప్రాంతాలకు వెళ్లి వస్తుండడంతోనే గతంలో ఈ ప్రాంతంలో కరోనా వ్యాప్తి పెరిగింది. ఒక దశలో కళాశాలల నుంచి వచ్చే విద్యార్థుల్లోనూ కరోనా కేసులు నమోదయ్యాయి. తాజాగా స్థానికుడు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి జ్వరం, జలుబుతో బాధపడుతూ ఓ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసుకోగా కొవిడ్ పాజిటివ్‌గా తేలింది. వైద్యులు అవసరమైన మందులు ఇచ్చి పంపించారు. రెండు, మూడు రోజుల క్రితం గోదావరిఖనిలోని రెండు వేర్వేరు కాలనీలకు చెందిన ఇద్దరికి కరోనా సోకినట్లుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రితో పాటు ఈ ప్రాంతంలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ రోజు దాదాపు 25కు పైగా కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**మాస్కులు వాడితే మేలు**

కరోనా వ్యాప్తి మొదలైన నేపథ్యంలో ప్రతీఒక్కరు కొవిడ్ నిబంధనలను పాటిస్తే ప్రయోజనముంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. మాస్కులు ధరించడం, భౌతికదూరం పాటించడం, జనం గుమికూడిన స్థలాల్లోకి వెళ్లకపోవడం, తరచూ చేతులను శానిటైజ్ చేసుకోవడం తదితర నిబంధనలను తప్పకుండా పాటించాల్సి ఉంది. కానీ.. గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే వారితో పాటు గర్భిణుల రద్దీ ఎక్కువ ఉండడం కలిగిస్తోంది.

# ఎందుకో.. ఏమో.. రసం తగ్గుతోంది

నల్గొండ : నల్గొండ జిల్లా అనగానే ఒకప్పుడు నిమ్మ, బత్తాయి తోటలు గుర్తుకు వచ్చేవి. ఇదంతా గతం. ఒకప్పుడు రెండు లక్షలకు పైగా ఎకరాల విస్తీర్ణంలో ఉండి ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యధికంగా బత్తాయి పంట పండించే జిల్లాగా ఒక వెలుగు వెలిగిన నల్గొండలో.. ఏటేటా ఆ పంట సాగు గణనీయంగా తగ్గుతోంది. అధికారిక లెక్కల ప్రకారం ప్రస్తుతం 42 వేల ఎకరాల్లో బత్తాయి సాగవుతుందని అధికారులు అంచనా వేస్తుండగా..క్షేత్రస్థాయిలో అది 30 వేల ఎకరాలకు పడిపోయింది. రాష్ట్రంలోనే తొలిసారిగా బత్తాయి మార్కెట్‌ను నల్గొండలో ఏర్పాటు చేసినా.. అందులో కార్యకలాపాలు జరగడం లేదు. మరోవైపు మార్కెటింగ్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం, ధరల హెచ్చుతగ్గులు, నీటి వసతి పెరగడం తదితర కారణాలతో రైతులు సైతం బత్తాయి పంటను సాగు చేయడానికి ముందుకు రావడం లేదు.

నల్గొండ, కనగల్, చండూరు, గుర్రంపోడు, హాలియా, పెద్దవూర, పీఏ పల్లి, మల్లేపల్లి, నాంపల్లి, మునుగోడు ప్రాంతాల్లో ఒకప్పుడు రైతులంతా బత్తాయినే పండించేవాళ్లు. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) కాల్వ వచ్చిన తర్వాత ఈ ప్రాంతాల్లోని భూములకు



నీటి వసతి పెరగడం, ఆ తడితో వేరుపురుగు తెగుళ్లు సోకడంతో క్రమంగా బత్తాయి పంట సాగు కనుమరుగవుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న ఐదారేళ్లలో ఉమ్మడి జిల్లాలో సాగు 5 వేల ఎకరాలకు పడిపోవడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సాధారణంగా బత్తాయి మొక్కలను నాటిన తర్వాత నాలుగేళ్ల నుంచి దిగుబడులు మొదలవుతాయి. 20 ఏళ్ల వరకు కాపు వస్తుండగా..రైతులు మాత్రం ఏడెనిమిదేళ్లలోనే దిగుబడులు తీసి అనంతరం చెట్లను నరికివేస్తున్నారు.

**అదే దారిలో నిమ్మ**

ఉమ్మడి రాష్ట్రంలోనే నిమ్మ పంటకు అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న నల్గొండ జిల్లాలో ఆ పంట విస్తీర్ణమూ క్రమంగా తగ్గుతోంది. ఐదేళ్ల క్రితం 45 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నిమ్మ, ప్రస్తుతం 12 వేలకు పడిపోయింది. బహిరంగ మార్కెట్లో ధరలున్నా రైతుకు గిట్టుబాటు ధర తగ్గకపోవడం, అంతుచిక్కని తెగుళ్లు వచ్చి చెట్లు ఎండిపోవడం, గత ఐదారేళ్లుగా నీటి వసతి పెరిగి, వరి పంట సాగుకే రైతులు మొగ్గు చూపుతుండటంతో నిమ్మ సాగు తగ్గుతోంది. ప్రస్తుత పరిణామాలను బట్టి గత చరిత్ర కనుమరుగయ్యే ప్రమాదం నెలకొందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బత్తాయి, నిమ్మ సాగు వైపు రైతులు వెళ్లేలా ప్రోత్సహించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న వాదనలున్నాయి. ఇటీవలే ప్రభుత్వం సైతం నల్గొండ జిల్లాను బత్తాయి క్లస్టర్‌గా ప్రకటించి ఈ పంట సాగు పెరుగుదలకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. వీటిని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసినప్పుడే బత్తాయి పంటను కాపాడుకోగలమని రైతులు వెల్లడిస్తున్నారు.

**గిట్టుబాటు లేకే**

ఒకప్పుడు నిమ్మలో అద్భుతాలు చేసిన వాళ్లమే. అయితే ఇప్పుడా పరిస్థితి లేదు. తెగుళ్లు, ఇతరత్రా కారణాలతో నిమ్మ నుంచి వచ్చే రాబడి కూలీలకు, ఇతరత్రా ఖర్చులకే వెళ్తోంది. ఏమీ గిట్టుబాటు కావడం లేదు. గతంలో ఉన్న దాని కంటే నీటి వసతి సైతంపెరిగింది. దీంతో సహజంగానే వరిసాగుకు మొగ్గుచూపుతున్నాం. దీంతో నిమ్మ తోటల సాగును తగ్గించాం.

యానాల క్రిష్ణారెడ్డి, నెల్లిబండ, నకిరేకల్ మండలం

**చర్యలు తీసుకుంటున్నాం**

జిల్లాను బత్తాయి క్లస్టర్‌గా ప్రకటించి ఈ పంట సాగు మరింత పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. వివిధ కారణాలతో రైతులు బత్తాయి సాగును తగ్గిస్తున్నది వాస్తవమే. ఏ తెగుళ్లు వచ్చినా తట్టుకునే సామర్థ్యమున్న నాణ్యమైన మొక్కలను రైతులకు సరఫరా చేసి తిరిగి వారు బత్తాయి సాగు వైపు మళ్లేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. సంగీత లక్ష్మి, డిప్యూటీ డైరెక్టర్, ఉద్యాన శాఖ, నల్గొండ

# వెల్లంకిపై మమకారం.. దాతల సహకారం

రామన్నపేట :: రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి రాష్ట్ర స్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారం దక్కింది. కేంద్రం నిర్దేశించిన 9 అంశాల్లో ఒకటైన స్వయం సమృద్ధి విభాగంలో రెండో స్థానం సాధించింది. గ్రామ సర్పంచి ఎడ్ల మహేందర్‌రెడ్డి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతో పాటు సొంత నిధులు వినియోగించి గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈయన స్ఫూర్తితో కొంతమంది దాతలు ముందుకు రావడం తదితర కారణాలతో వెల్లంకి గ్రామానికి రాష్ట్ర స్థాయి పురస్కారం దక్కింది. 2021-22 సంవత్సరానికి గాను హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా సర్పంచి ఎడ్ల మహేందర్‌రెడ్డి అందుకున్నారు. రూ. 80 లక్షల వ్యయంతో అధునాతన సదుపాయాలతో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించారు. రూ. 3 లక్షలతో నీటి శుద్ధి కేంద్రానికి గది, వైకుంఠధామంలో రూ. 12.50 లక్షల వ్యయంతో గది, రూ. 3లక్షలు వ్యయంతో వాణిజ్య సముదాయం వంటి పలు పనులు సొంత నిధులతో చేపట్టారు. రైతు వేదికకు అదనంగా సొంత నిధులు ఖర్చు చేసి హైటెక్ భవనంలా దిద్దారు. హెచ్‌పీసీఎల్ సంస్థ సహకారంతో రూ. 20లక్షలు వ్యయంతో అంగన్‌వాడీ భవనం నిర్మించారు. గ్రామంలో హరితహారం కింద నాటిన మొక్కలతో గ్రామంలోని పలు వీధులు పచ్చదనంతో కన్పిస్తాయి. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ కె.నర్సింహులు ఫిబ్రవరి 24న వెల్లంకిని సందర్శించి పరిశీలించారు. రాష్ట్ర స్థాయిలో పురస్కారాన్ని అందుకోవటంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బదిలీలలు

నిజామాబాద్ : ఇప్పటికే జిల్లాలో 19 మంది ఉపాధ్యాయులు తప్పుడు వైద్య ధ్రువపత్రాలు సమర్పించి అడ్డదారిలో బదిలీలు, పదోన్నతులు పొందాలని భావించి అడ్డంగా దొరికిపోయిన విషయం తెలిసిందే. తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించిన ఉపాధ్యాయులతో పాటు సహకరించిన వైద్యాధికారులపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని ఒకవైపు డిమాండ్ కొనసాగుతుండగా.. మరోవైపు స్పౌజ్ పాయింట్లు అడ్డం పెట్టుకొని అక్రమ బదిలీలకు పాల్పడినట్లు సమాచారం. స్పౌజ్ పాయింట్లు ఉపయోగించుకున్న ఉపాధ్యాయుల బదిలీలపై ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ 'మాములు'గా వ్యవహరిస్తుందనే ఆరోపణలున్నాయి.

స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం.. ఎస్‌ఏ బదిలీల సమయంలో ఉపాధ్యాయ దంపతుల పాయింట్లు(స్పౌజ్) ఉపయోగించుకునేవారు భాగస్వామి పనిచేస్తున్న పాఠశాలకు సమీపంలోని బడిని ఆప్షన్‌గా ఎంచుకోవాలనేది నిబంధన. గతంలో వేర్వేరు ప్రాంతాల్లో పనిచేసిన వారిని కుటుంబ, సామాజిక, ఆర్థిక అంశాల దృష్ట్యా దగ్గర ప్రాంతానికి బదిలీ చేసిన విషయం విధితమే. స్పౌజ్ ప్రాధాన్యతలో భాగంగా ఫిబ్రవరిలో ఇతర జిల్లాల నుంచి 50 మంది ఎస్‌ఏ ఉపాధ్యాయులు జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం ఎస్‌ఏ బదిలీల్లోనూ కొందరు స్పౌజ్ పాయింట్లు ఉపయోగించుకొని మెరిట్ లిస్టులో ముందు ర్యాంకులు సొంతం చేసుకున్నారు. నిబంధనల మేరకు ఉపాధ్యాయ దంపతులు వారి భాగస్వామి పనిచేస్తున్న పాఠశాలకు సమీపంలోని బడిని ఆప్షన్‌గా ఎంచుకోవాలి. కానీ, బదిలీ జాబితా పరిశీలిస్తే వేరేలా ఉంది. భాగస్వామి సమీపంలో కాకుండా జిల్లా కేంద్రంలోని పాఠశాలల్ని ఎంచుకున్నారు. ఇలా చేయడంతో సాధారణ ఉపాధ్యాయులకు రెండు రకాలుగా నష్టం జరగనుంది. ప్రస్తుత మెరిట్ లిస్టులో వెనకబడతారు. అలాగే తర్వాత తమ భాగస్వామికి దూరంగా ఉండటంతో ఇబ్బందులు వస్తున్నాయని, సమీప పాఠశాలకు బదిలీ చేయాలని వారి భాగస్వాములు కోరే అవకాశముంది.

అధికారులు కుణ్ణంగా పరిశీలించాలి.. ఇప్పటికే తప్పుడు వైద్య ధ్రువపత్రాల విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్న విద్యాశాఖ స్పౌజ్ ప్రాధాన్యత విషయంలోనైనా కఠినంగా వ్యవహరించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. అక్రమంగా బదిలీ అయిన ఉపాధ్యాయుల్ని పొరుగు జిల్లాలో జిల్లా విద్యాశాఖాధికారి రివర్షన్ చేశారు. జిల్లాల్లోనూ ఎస్‌ఏ బదిలీలపై లోతుగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

మచ్చుకు కొన్ని...జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లం విభాగం బదిలీలు పరిశీలించగా ముగ్గురు ఉపాధ్యాయులు భాగస్వామి పాఠశాలకు సమీపంలో కాకుండా జిల్లా కేంద్రంలోని పాఠశాలకు బదిలీ అయ్యారు. ఒకేవిభాగంలో ముగ్గురు ఉపాధ్యాయులుంటే మిగతా అన్ని విభాగాల్లో ఎంతమంది ఉంటారోనని ఉపాధ్యాయ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి జాబితాపై లోతుగా విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎడపల్లి మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు తన భాగస్వామి నవీపేట మండలంలో పనిచేస్తుండగా జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు. నవీపేట మండలంలోని సాటాపూర్‌ఫారంలో ఖాళీ ఉన్నప్పటికీ నిజామాబాద్ నగరం ఎంచుకున్నారు. బోధన్‌లో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు భాగస్వామి ఆర్మూర్ మండలంలో పనిచేస్తుండగా ఆమె జిల్లా కేంద్రంలోని పాఠశాలకు బదిలీ అయ్యారు. ఆర్మూర్‌లోని సైదాబాద్ పాఠశాలలో ఖాళీ ఉన్నప్పటికీ వెళ్లలేదు. ర్యాంకు లిస్టులో 7వ స్థానంలో ఉన్న ఉపాధ్యాయురాలు భాగస్వామి ఆర్మూర్‌లో పనిచేస్తున్నా జిల్లా కేంద్రాన్ని ఎంపిక చేసుకోగా.. 22వ స్థానంలో ఉన్న ఉపాధ్యాయురాలిని ఆర్మూర్‌లో స్థానం లభించింది. అంటే ఏడోస్థానంలో ఉన్న ఉపాధ్యాయురాలు కోరుకుంటే ఆర్మూర్ వచ్చేదే.. కానీ, జిల్లా కేంద్రానికే ప్రాధాన్యం ఇచ్చారనేందుకు ఇది నిదర్శనం.

అభ్యంతరాలకు అవకాశముంది

– దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్

బదిలీల్లో స్పౌజ్ పాయింట్లు ఉపయోగించిన వారి దరఖాస్తులు పూర్తిగా పరిశీలించి, పూర్తి పారదర్శకత కోసం ప్రయత్నించాం. ఉపాధ్యాయులు ఎంచుకున్న ఆప్షన్లు మార్చే అధికారం మాకు లేదు. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఆప్షన్లు ఎంచుకున్నవారుంటే వారిపై అభ్యంతరం తెలిపేందుకు ఇంకా అవకాశముంది. అలాంటివారిపై రాష్ట్ర విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది.

## ప్రజలకు పన్నులు.. ప్రముఖుల ఇళ్ల చుట్టే పనులు

జడ్చర్ల : పురపాలికకు ప్రజలు చెల్లించే పన్నులే ప్రధాన ఆదాయ వనరు. ఆ నిధులతో వెనకబడిన కాలనీలు, అవసరమున్న చోట అభివృద్ధి పనులు చేపట్టాలని నిబంధనలు చెబుతున్నాయి. జడ్చర్ల పురపాలికలో మాత్రం వింత పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడిగా చాలా కాలనీల్లో సరైన రహదారులు, మురుగు కాల్వలు, వీధిదీపాలు లేవు. అదే పలుకుబడి ఉన్నవారు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల ఇల్లు ఒక్కటి ఉన్నా ఆ ప్రాంతంలో కాల్వలు, సీసీ రహదారులు నిర్మిస్తున్నారు. దీన్ని పట్టణంలో నిర్లక్ష్యానికి గురవుతున్న కాలనీల ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ల పుణ్యమా అని పట్టణంలో చాలా కాలనీలకు సీసీ రోడ్లు వచ్చాయి తప్ప ఇతర పనులేవీ చేపట్టలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

సమస్యలు ఇలా..ఇటీవల అధికార పార్టీ భారాకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు అశోక్‌నగర్, విజయ్‌నగర్ కాలనీల్లో భారీ భవంతులు నిర్మించుకున్నారు. వారి ఇళ్ల వద్ద ఆగమేఘాల మీద రహదారులు, కాల్వలు నిర్మించారు. 3వ వార్డులో కొత్తగా నిర్మించిన కమ్యూనిటీ ఆస్పత్రి సమీపంలో, పలువురు కౌన్సిలర్ల ఇళ్ల వద్ద అభివృద్ధి పనులు చేపట్టారు. 25వ వార్డు పరిధి జౌళీనగర్‌లో, భవానీనగర్, విజయ్‌నగర్ కాలనీ, అశోక్‌నగర్, గౌరీశంకర్ కాలనీ, కావేరమ్మపేట రాజీవ్‌నగర్, వెంకటేశ్వర కాలనీ, విద్యానగర్ కాలనీ, పాతబజారు తదితర ప్రాంతాల్లో కాలనీల్లో మాత్రం కాల్వలు, వీధి దీపాలు లేవు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయిందని జనం వాపోతున్నారు. తాము పన్నులు చెల్లించటం లేదా అని ఆయా కాలనీల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దోమలు, ఈగల బెడదతో సతమతమవుతూ రోగాల బారినపడుతున్నామని, వీధిదీపాలు లేకపోవటం, పాముల సంచారంతో రాత్రి వేళ ఇంటి బయట అడుగు పెట్టాలంటే భయమవుతోందని తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొత్తగా పురపాలికకు రూ.32కోట్లు మంజూరైనట్లు చెబుతున్నా. వాటిలో ఇప్పటికే రూ.15కోట్ల నిధులకు సంబంధించిన పనులు టెండర్ల దశలో ఉన్నాయి. మిగతా నిధులు ఇతర పనులకు వినియోగించేందుకు నిర్ణయించారు. ఇక తమ సమస్యలు ఎప్పుడు తీరుతాయని జనం ప్రశ్నిస్తున్నారు.

అన్ని పనులు పూర్తి చేస్తాం పురపాలికకు నిధులు మంజూరయ్యాయి. పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలో అన్ని కాలనీల్లో పనులు చేపట్టి సౌకర్యాలు కల్పిస్తాం. సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతం వాళ్లు మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తాం.మహమూద్ షేక్, పుర కమిషనర్, జడ్చర్ల

# మార్కెట్‌కు మొక్కజొన్న



నర్సంపేట : ఖరీఫ్‌లో రైతులు పండించిన మొక్కజొన్న విక్రయానికి మార్కెట్‌కు రాక మొదలయింది. నర్సంపేటలోని వ్యవసాయ మార్కెట్కు తీసుకువస్తున్నారు. దీంతో మార్కెట్లో రద్దీ నెలకొంది. రబీ సీజన్‌లో ధాన్యం అమ్మకాలు ముగిశాక ఎలాంటి పంటల ఉత్పత్తి లేక మార్కెట్ యార్డు బోసిపోయింది. ఈ క్రమంలో కిందటి వారం నుంచి హలదారులు పండించిన మక్కలను యార్డుకు తరలిస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది మొక్కజొన్న పంట విస్తీర్ణం తగ్గడమేగాక ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడి కూడా తగ్గినట్లు పలువురు రైతులు చెప్పారు. ప్రభుత్వం మొక్కజొన్నలకు మద్దతు ధర క్వింటాలుకు రూ.2090గా నిర్ణయించింది. ప్రస్తుతం అమ్మకానికి వస్తున్న మక్కలు క్వింటాలుకు రూ.2050–2090 ధర పలుకుతోంది. గత రబీలో మక్కల ధర మార్కెట్ పడిపోవడంతో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి మద్దతు ధరకు కొనుగోలు చేసి కర్షకులకు అండగా నిలిచారు. ఈ సీజన్‌లో మొక్కజొన్న కోత పనులు ఇప్పుడిప్పుడే మొదలైనందున తక్కువగా వస్తున్నాయని మరో 10–15 రోజుల్లో మార్కెట్కు పోటెత్తుతాయని ధర ఇప్పుడే ఇలా ఉంటే ఎక్కువ మొత్తంలో దిగుమతైతే ధరల పరిస్థితి ఎలా ఉంటుందోనని పలువురు చర్చించుకుంటున్నారు. గిట్టుబాటు ధర లభించేలా అధికారులు చొరవజూపి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాత మక్కలకు పెరిగిన డిమాండ్

ప్రస్తుతం చేతికి వచ్చిన మొక్కజొన్న కంటే గత రబీలో పండించిన పాత మక్కలకు విపణిలో డిమాండ్ పెరిగింది. అప్పుడు వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తే అధికారులు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి మద్దతు ధర చెల్లించి అన్నదాతల నుంచి కొనుగోలు చేశారు. కొందరు వ్యాపారులు, రైతులు మక్కలను నిలువ చేసి అమ్ముతున్న పాత మక్కలకు క్వింటాలుకు రూ.2300ల ధర పలుకుతోంది. మద్దతు ధర కంటే క్వింటాలుకు రూ.210 ఎక్కువ పలుకుతోంది. కొత్త మొక్కజొన్నల కంటే పాత మక్కలు బాగా ఆరబెట్టినవి కావడం, గింజలు నాణ్యతగా ఉండడం వల్ల కోళ్ల ఫారాల వ్యాపారులు వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. పాత మక్కలకు ధర బాగా పెరగడంతో అప్పుడు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి నిలువ చేసిన వ్యాపారులు ఇప్పుడు అమ్ముకొని మంచి లాభాలు గడిస్తున్నారు.

# మండలం ఓచోట.. సేవలు మరోచోట




కోరుట్ల : పరిపాలన సౌలభ్యం కోసం చేపట్టిన గ్రామాల విలీన ప్రక్రియ అయా గ్రామాలకు ఇబ్బందులు తెచ్చిపెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 2016లో కొత్త మండలాల ఏర్పాటులో భాగంగా రెవెన్యూ గ్రామాలను భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా సమీప మండలంలో విలీనం చేశారు. కోరుట్ల మండలంలో ఉన్న పెద్దాపూర్ గ్రామాన్ని మెట్‌పల్లి మండలంలో, మల్లాపూర్ మండలంలో ఉన్న ధర్మారం గ్రామాన్ని కోరుట్ల మండలంలో విలీనం చేశారు. విలీన గ్రామాల్లో ఉన్న కొన్ని శాఖలు మాత్రమే కొత్త మండల పరిధిలో ఉండగా కొన్ని శాఖలు ఇప్పటికీ పాత మండల పరిధిలోనే ఉన్నాయి. దీంతో అయా గ్రామాల ప్రజలు పాలనాపరంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

బదిలీ కానీ పోలీసు, విద్యుత్తు, వైద్యశాఖలు

మూడు శాఖలు ఇంత వరకూ బదిలీ కాకపోవడంతో తిరిగి పాత మండలానికి వెళ్లడం పరిపాలనా పరంగా దూరాభారంగా మారుతోంది. పోలీసు, వైద్యం, విద్యుత్తుకు చెందిన శాఖలు మాత్రం ఇప్పటికీ పాత మండల పరిధిలోనే ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఎదైనా సంఘటన జరిగితే పోలీసులు రావడం ఇబ్బందికరంగా మారుతోంది. శవపంచానామా, పోస్టుమార్టం కోసం పాత మండలానికి వెళ్లడం గంటల తరబడి వెచి ఉండాల్సి వస్తోంది. అకాల వర్షాల వల్ల విద్యుత్తు స్తంభాలు, కొత్త విద్యుత్తు నియంత్రికలు మంజూరు రావడం లేదు. మండల కోటా పరిధిలో విలీన గ్రామాలు లేకపోవడంతో గ్రామాలకు రావాల్సిన అభివృద్ధి నిధులు రావడం లేదు. విద్యుత్తు సమస్య ఏర్పడితే అధికారులు 18 కిలోమీటర్లు రావడం దూరాభారంగా మారుతుంది. మండలం వేరే కావడంతో ప్రజాప్రతినిధులతో అధికారులకు సంబంధాలు ఉండటం లేదు. దీంతో విలీన గ్రామాలపై అధికారులు అసక్తి కనబరచడం లేదని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అయా పరిధిలో శాఖల సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీలు మాట్లాడలేక పోతున్నారు. మండల సమావేశానికి అయా శాఖల అధికారులు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు హాజరుకావడం లేదు– ఇప్ప మంగ, సర్పంచి ధర్మారం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మూడు శాఖల అధికారులు హాజరు కావడం లేదు. దీంతో సమస్యలను అధికారులకు చెప్పుకోలేక పోతున్నాం. మూడు శాఖలను త్వరితగతిన కొత్త మండలానికి బదిలీ చేసేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

దూరాభారం తప్పడం లేదు

మల్లాపూర్ మండలంలోని ధర్మారం గ్రామాన్ని కోరుట్ల మండలంలో విలీనం చేశారు. కోరుట్ల నుంచి ధర్మారం గ్రామానికి ఏడు కిలో మీటర్ల మాత్రమే. పాత మండలం 18 కిలోమీటర్లు ఉండేది. పెద్దాపూర్ గ్రామాన్ని మెట్‌పల్లి మండలంలో విలీనం చేశారు. పరిపాలనా సౌలభ్యంలో ధర్మారం గ్రామ ప్రజలకు కోరుట్ల మండలానికి రావడానికి దూరాభారం తగ్గింది. రెవెన్యూ, విద్యాశాఖ, పంచాయతీరాజ్ ఇతర శాఖలు మండలంలో విలీనమయ్యాయి.

# సలహా ఇచ్చిందే లేదు



కామారెడ్డి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమం గాడి తప్పుతోంది. పట్టణాల ప్రగతికి ఎంపిక చేసిన అభివృద్ధి కమిటీలు నామమాత్రమయ్యాయి. ఆయా విషయాల్లో పాలకవర్గాల జోక్యంతో కమిటీ సభ్యుల మాటలను పట్టించుకునేవారే లేరు. మూడేళ్ల క్రితం వార్డుల్లో కమిటీలను ఏర్పాటు చేసినా వారు ఇప్పటి వరకు పురపాలికలకు వచ్చిన దాఖలాలు లేవు. కమిటీ సభ్యులతో సమన్వయం చేయాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. ఇప్పటికే పాలకవర్గాలు ఏర్పడి మూడేళ్లు కావస్తోన్న క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

కాగితాలకే పరిమితం..జిల్లాలో ఆయా పురపాలికల పరిధిలో నియమించిన సభ్యులు తమ పరిధిలోని సమస్యలను గుర్తించి పాలకవర్గం, అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావాలి. ప్రగతి పనుల విషయంలో తగిన సూచనలు అందించాలి. కాని వార్డు కమిటీలు కాగితాలకే పరిమితమయ్యాయి. మూడు పురపాలక సంఘాల్లో ఏ ఒక్క రోజు కూడా వార్డు కమిటీ సభ్యులు వచ్చి సలహాలు ఇచ్చిన దాఖలాలు లేవు. ఒకవేళ సలహాలు ఇచ్చినా ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చామనే ధీమాతో కౌన్సిలర్లు వీరిని పట్టించుకోవడం లేదు. పట్టణ ప్రగతి ద్వారా ప్రభుత్వం ప్రతి నెల నిధులు విడుదల చేస్తున్నా వాటిని ఏయే పనులకు ఖర్చుపెడుతున్నారో స్పష్టత కరవైంది. వార్డు ప్రత్యేకాధికారి, కౌన్సిలర్, సభ్యులు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి వసతి తదితర సమస్యలను పరిశీలించాలి. చేపట్టిన పనులపై ప్రతిపాదనలు ఇవ్వాలి. కాని ఇవేమీ జరగడం లేదు. వార్డుల్లో చేపట్టే ప్రగతి పనుల నాణ్యత పరిశీలించేందుకు కూడా కమిటీల సభ్యులకు అవకాశం కల్పించినా ప్రయోజనం లేకుండా పోతోంది.

అయిదు అంశాల్లో..ప్రభుత్వం తెచ్చిన నూతన పురపాలక చట్టంలో కఠిన నిబంధనలు పొందుపర్చారు. వార్డు కమిటీల పాత్రకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు. అయిదు అంశాల్లో కమిటీల తోడ్పాటు అవసరమని సూచించారు. ఈ కమిటీలు ప్రధానంగా పారిశుద్ధ్యం, హరితహారం, తాగునీటి సరఫరా, ఉద్యానాల ప్రగతి, పన్నుల వసూళ్లపై సూచనలు అందించాల్సి ఉంటుంది. ప్రగతి పనులను ఏ విధంగా చేపట్టాలో వివరాలు ఇవ్వాలి. జిల్లాలోని ఆయా సీసీ రోడ్లు అధ్వానంగా మారాయి. శివారు కాలనీల్లో ప్రగతి చర్యలు కరవయ్యాయి. నాలాల ఆక్రమణలు, నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. వార్డుల సమగ్రాభివృద్ధికి చర్యలు లేవు. ఈ కమిటీలు మెరుగైన సూచనలు అందిస్తే పురపాలికలు కొంతమేర ప్రగతిని సాధించే అవకాశం ఉంటుంది. అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తాం– దేవేందర్, కమిషనర్–కామారెడ్డిపురపాలికలో వార్డు కమిటీలకు ప్రగతిలో భాగస్వామ్యం కల్పిస్తాం. నూతన పురపాలక చట్టం ప్రకారం కమిటీలతో త్వరలోనే సమావేశం నిర్వహిస్తాం. పట్టణాభివృద్ధిలో వారి సూచనలు తీసుకుంటాం. సమస్యలను గుర్తించి కార్యాలయంలో వివరాలు అందజేస్తే పరిష్కారానికి కృషి చేస్తాం.

# సౌకర్యాల కొరత.. పేరుకే సాధికారత

పాలమూరు : మొత్తం ప్రవేశాల్లో 75 నుంచి 80 శాతం విద్యార్థినులవే ఉండటంతో పాలమూరు విశ్వవిద్యాలయం(పీయూ) మహిళా సాధికారత సాధించిన వర్సిటీగా గుర్తింపు పొందింది. విద్యార్థినులకు సరిపడా వసతులు మాత్రం లేవు. సరిపడా గదులు లేక ఐదుగురు నిద్రించాల్సిన పడకలపై 8 నుంచి 10 మంది సర్దుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతేడాది జూన్ 10న రూ.10కోట్ల నిధులతో నూతన వసతిగృహ నిర్మాణానికి మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. 15 నెలలు గడుస్తున్నా పనులు పూర్తికాలేదు. కొన్ని నెలల క్రితం పీయూలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలకు మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ రాగా విద్యార్థినులు ఆయన దృష్టికి వసతిగృహం సమస్యను తీసుకెళ్లారు. మంత్రి ప్రశ్నించగా ఆగస్టు నెలాఖరుకు వందశాతం పనులు పూర్తిచేసి వసతిగృహాన్ని అందుబాటులోకి తెస్తామని గుత్తేదారు మాట ఇచ్చారు. విద్యార్థినులు మరోసారి ఫిర్యాదు చేయకుండా కచ్చితంగా నిర్ణీత సమయానికి పూర్తి చేసేలా చూడాలని పీయూ అధికారులకు మంత్రి ఆదేశించారు. అదనంగా నెల గడిచినా పనులు పూర్తికాలేదు. భవనం పూర్తి కావాలంటే మరో 2–3 నెలల సమయం పడుతుందని అక్కడ పనిచేస్తున్న కార్మికులు చెబుతున్నారు. నిర్మాణం కూడా చాలా నాసిరకంగా కొనసాగుతోందని పీయూ విద్యార్థుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం వసతి గృహంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు మాత్రమే ఉన్నారు. ప్రథమ సంవత్సరంలో చేరిన వారు వస్తే తమ పరిస్థితేంటోనని



విద్యార్థినులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పీయూ ఉప కులపతి ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా చెప్పిన గడువులోగా పనులు పూర్తికాకపోవటంతో ఇప్పటికే గుత్తేదారుకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేయించేందుకు కృషిచేస్తామని, విద్యార్థినులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

40 మందికి స్నానపు గదులు మూడే

ఆరు గదుల్లో కలిపి 40 మందికి పైగా ఉంటున్నాం. మూడే వాష్‌రూంలు ఉన్నాయి. ఈ లెక్క చాలు మా పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో చెప్పడానికి. సమయం సరిపోక ఒక్కోసారి స్నానం చేయకుండానే ముఖం కడుక్కుని కళాశాలకు వెళ్లాల్సి వస్తుంది. చాలా మంది విద్యార్థినులది ఇదే పరిస్థితి. ఇదేమని అధికారులను అడిగితే కొత్త భవనం నిర్మాణంలో ఉందని చెబుతున్నారు. ఇంకెన్నాళ్లు సార్ అంటే అదిగో.. ఇదిగో అంటారే తప్ప పూర్తి చేయించటం లేదు.

ఎ.శిల్ప, మేళ్లచెరువు, జోగులాంబ గద్వాల

భవనం పూర్తిచేయించాలి

నిబంధనల ప్రకారం ఒక విద్యార్థినికి ఒక బెడ్ ఉండాలి. ఇక్కడ నాలుగు బెడ్స్ ఉంటే 9 మందిమి సర్దుకుంటున్నాం. అన్ని వసతులు సక్రమంగా ఉంటేనే చదువుపై దృష్టి కేంద్రీకరించొచ్చు. ఇక్కడ 80 శాతం విద్యార్థినులే ఉంటారు. మహిళా సాధికారత సాధించిన వర్సిటీగా గుర్తింపు పొందిన పీయూలో ఈ పరిస్థితి ఉండటం భావ్యం కాదు. భవనం లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవిస్తున్నా సమస్య పరిష్కారం కావటం లేదు.

ఎన్.పూజ, ఎంఏ(పొలిటికల్ సైన్స్)

మా పరిస్థితి మారటం లేదు

నేను ఖమ్మం నుంచి చదువుకోవడానికి పీయూకు వచ్చా. ఇక్కడ బోధన చాలా బాగున్నా.. సౌకర్యాలు అనుకున్న స్థాయిలో లేవు. గర్ల్స్ హాస్టల్స్‌లో పరిస్థితి దయనీయంగా ఉంది. మూడు పడకలు ఉంటే ఐదుగురం సర్దుబాటు చేసుకోవాల్సి వస్తోంది. ఎలాగోలా ఏడాది పూర్తయ్యింది. రెండో సంవత్సరంలో అయినా మంచి మెరుగైన వసతి పొందుతామని భావించాం. ఆ పరిస్థితి మాత్రం కనిపించటం లేదు. అధికారులు దృష్టి సారించి కొత్త భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలి.జె.శ్రావణి, ఎంఏ (ఎకనామిక్స్)

# నీటి లభ్యతపై ఆందోళన

కొల్లాపూర్ : సాగు, తాగునీటి ప్రాజెక్టులకు కృష్ణానదిలో నీటి లభ్యతపై ఆందోళన నెలకొంది. ఈ సారి ఆశించిన మేర వరదజలాలు రాకపోవడం, లక్ష్యం మేర శ్రీశైలం డ్యాంలోకి నీటిమట్టం చేరలేదు. దీంతోపాటు ఉభయ తెలుగురాష్ట్రాలలో సాగు, తాగునీటి ప్రాజెక్టులకు నీటివాడకం పెరిగింది. ఎంజీకేఎల్‌ఐ, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మిషన్ భగీరథ పథకాలకు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామపరిధిలోని రేగుమాన్‌గడ్డలో శ్రీశైలం తిరుగుజలాలు ఆధారమయ్యాయి. నదీ ప్రవాహం ఉండే కోతిగుండు నుంచి రేగుమాన్‌గడ్డ వరకు అప్రోచ్ కాల్వలు తవ్వారు. 5 కిలోమీటర్ల మేర ఈ ప్రాంతం విస్తరించి ఉన్న, శ్రీశైలం డ్యాం నిండకపోవడం, రేగుమాన్‌గడ్డ తీరానికి లక్ష్యంమేర వరదజలాలు చేరలేదు. మంగళవారం నాటికి 856 అడుగుల నీళ్లు మాత్రమే నిల్వ ఉన్నాయి.నదిలో తగ్గుతున్న నీటిమట్టం..

ఎంజీకేఎల్‌ఐలో 4 లక్షల ఎకరాలకు సాగునీరు, వేలాది గ్రామాలకు తాగునీరు అందించాల్సిన లక్ష్యం ఉంది. నేటి వరకు 10 టీఎంసీల నీటి ఎత్తిపోత జరిగింది. కేటాయింపు 40 టీఎంసీలు ఉన్నా.. లక్ష్యంమేర ఏటా ఎత్తిపోత జరగడం లేదు. 5 పంపులు పనిచేయకపోవడం, రెండేళ్ల నుంచి 1, 2, 4వ మోటార్లు మాత్రమే పని చేస్తున్నాయి. వానాకాలం సీజన్ ముగియక ముందే కృష్ణానదిలో నీటిమట్టం వేగంగా తగ్గిపోతోంది. దీంతో పాటు పాలమూరు ఎత్తిపోతల పథకంలో భారీ లక్ష్యం ఉంది. ఇక్కడ కూడా 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించాలి. 67 టీఎంసీల మేర నిల్వకు అంజనగిరి, ఏదుల, వట్టెం, కర్వెన, వెంకటాద్రి జలాశయాల నిర్మాణం జరిగినా నదిలో నీటి లభ్యతపైనే ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాజెక్టుల్లో సాంకేతిక సమస్యలు, పంపులు సక్రమంగా పనిచేయకపోవడం వలన వరదజలాల ప్రవాహం సమయంలో లక్ష్యంమేర నీళ్ల ఎత్తిపోత జరగడం లేదంటూ ఇంజినీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రస్తుతం ఉన్న తిరుగుజలాలను వాడుకునేలా చర్యలు తీసుకోవాలంటూ రైతులు కోరుతున్నారు.

## బడులు.. అపరిశుభ్రతకు నెలవులు

భూపాలపల్లి : భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలో రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, పుల్లూరిరామయ్యపల్లి, కాశీంపల్లి, జంగేడు, భూపాలపల్లిలో నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలు, వివిధ గ్రామాలు, కాలనీల్లో మరో 14 ప్రాథమిక పాఠశాలలున్నాయి. భూపాలపల్లి పట్టణానికి ఆరు నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో చాలావరకు ప్రాథమిక పాఠశాలలున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 30 వార్డులుండగా, 80 వేలకు పైగా జనాభా ఉంది. ఈ జనాభాకు పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ప్రస్తుతం 90 మంది కార్మికులుండగా, వీరు సరిపోవటం లేదనే కారణంతో మరికొంత మందిని నియమించాలని పాలక సభ్యులు కోరుతున్నారు. ఇప్పటికే పారిశుద్ధ్య పనులకు సరిపోవడం లేదని, ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించడం ఎలా సాధ్యమవుతుందని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తామని ఒక పక్క ప్రభుత్వం చెబుతోంది. ఈ క్రమంలో మన ఊరు..మన బడి కార్యక్రమం పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అనేక మౌలిక సదుపాయాలు లేకుండానే కొనసాగుతున్నాయి. అనేక పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వాహణ సరిగా లేక నిరుపయోగంగా ఉంటున్నాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వ బడుల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అప్పగించింది. మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడటమే కాకుండా బడులను స్వచ్ఛంగా మార్చాలంటూ మూడేళ్ల క్రితమే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వుల ప్రకారం పంచాయతీ కార్మికులు తాము పాఠశాలల్లో చేపట్టలేమని వ్యతిరేకిస్తున్నారు. మున్సిపాలిటీలో, గ్రామ పంచాయతీల్లో అనేక రకాల పనులతో ఇబ్బంది ఏర్పడుతోందని, కార్మికుల కొరత కారణంగా పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం సాధ్యం కాదని కొందరు సర్పంచులు చెబుతున్నారు.

దినసరి కూలీలతో..

జిల్లాలో 428 వరకు ప్రభుత్వ పాఠశాలలున్నాయి. కొన్ని పాఠశాలల్లో 250 నుంచి 350 మంది వరకు విద్యార్థులుంటారు. ఆరు సంవత్సరాల క్రితం ఆర్ఎంఎస్ఏ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వాహణకు పారిశుద్ధ్యకార్మికులు (స్వావెంజర్ల)ను నియమించుకుని, వారికి నెలకు రూ.2500 వేతనం చెల్లించారు. వీరందరిని 2019–20 విద్యాసంవత్సరం ముగిసే వరకు ఉపయోగించుకుని, ఆ తర్వాత తొలగించారు. మళ్లీ వారిని నియమించకుండా పాఠశాలల్లో పారిశుద్ధ్యపనుల నిర్వాహణ మున్సిపాలిటీ కార్మికులు చేపట్టాలని, గ్రామాల్లో పంచాయతీలకు బాధ్యత అప్పగించారు. కార్మికుల కొరత కారణంగా సర్పంచులు పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు కార్మికులను పంపించడం లేదని పలువురు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా వరకు పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే వంతుల వారీగా ప్రస్తుతం ఆఫీసు గదిని, స్టాఫ్ రూంను శుభ్రం చేసుకుంటున్నారు. కొందరు హెచ్ఎంలు సొంత డబ్బులు చెల్లించి, దినసరి కూలీలతో పనులు చేయిస్తున్నారు.

ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి-రాంకుమార్, డీఈవో

ప్రభుత్వ బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు గ్రామాల్లో ఆయా పంచాయతీలు, మున్సిపాలిటీలే చేపట్టాలని అప్పట్లోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని పాఠశాలలకు కార్మికులు రావటం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఏదైనా ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## వరి కోతలు మొదలాయె.. కొనుగోలు కేంద్రాలు లేవాయె!

జనగామ : జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులతో గతంలో ఎన్నడూ లేని విధంగా అన్నదాతలు ముందస్తుగా సాగు పనులు చేపట్టారు. వానాకాలంలో సాగు చేసిన వరి పంట ప్రస్తుతం కోత దశకు రావడంతో గత వారం రోజుల నుంచే కోతలు మొదలయ్యాయి. వరి పంటకు మద్దతు ధర కల్పించేందుకు ఏటా ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తోంది. అయినతే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు దిశగా నేటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి సమీక్షలు, సమావేశాలు నిర్వహించలేదు. ఎటువంటి ప్రకటనలు చేయకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో రైతులకు మద్దతు ధర దక్కకుండా పోతోంది.

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 1.72 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. గతేడాది ఏప్రిల్‌లో కురిసిన వడగళ్ల వానతో వరి పంట నేల పాలు కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీని నుంచి గట్టెక్కేందుకు రైతులు వానాకాలం, యాసంగి సీజన్లలో ముందస్తు సాగుకు వెళుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు సైతం ఇవే సలహాలు, సూచనలు ఇస్తున్నారు. సాధారణంగా జులై చివరి వారం నుంచి ఆగస్టు చివరి వారం వరకు వరి నాట్లు వేయాల్సి ఉండగా.. జులై మొదటి వారం నుంచి నాట్లు వేయటం ప్రారంభించి ఆగస్టు మొదటి వారంలోపే పూర్తి చేశారు. వారం రోజుల నుంచే రైతులు వరి కోతలు చేపట్టారు. పంటను ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.

తక్కువ ధరతో నష్టం

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో రైతులు చేసేది లేక పంటను ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. క్వింటాల్ ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర ఏ-గ్రేడ్‌కు రూ.2203, సాధారణ రకానికి రూ.2183 కేటాయించారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాల్‌కు రూ.1800–1990 ధర మాత్రమే చెల్లిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాల్‌కు సుమారు రూ.300కు పైగా నష్టం వస్తోందని వాపోతున్నారు. రాబోయే రోజుల్లో ప్రైవేటు ధరలు మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి -రామచంద్రం, రైతు, గానుగుపహాడ్

కోసిన వరి ధాన్యాన్ని ట్రాక్టర్‌లో నింపుకొని జనగామకు తరలించేందుకు సిద్ధమవుతున్న ఈ రైతు పేరు శివరాత్రి రామచంద్రం. ఈయనది జనగామ మండలం గానుగుపహాడ్. వానాకాలంలో 5 ఎకరాల్లో పంట సాగు చేసి ప్రస్తుతం మూడెకరాల్లో కోతలు చేపట్టారు. ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకునేందుకు జనగామకు తరలించారు. రైతుతో 'న్యూస్‌టుడే' మాట్లాడగా.. ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లాలో 10 శాతం మేర పంటలు కోత దశలో ఉండగా.. మరో వారంలో వరి కోతలు ముమ్మరమయ్యే పరిస్థితులున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ఆయిల్‌పాం గెలగిల..



అశ్వారావుపేట : 'నానాటికీ తీసికట్టు నాగం బొట్లు' చందంగా ఆయిల్‌పాం గెలల ధర నెలనెలకూ దిగజారుతోంది. 2022లో రైతులను ఆకాశానికి ఎత్తేసిన ఆయిల్‌పాం గెలల ధర 2023లో ఒక్కసారిగా తల్లకిందులు చేసింది. ఈ ఆయిల్ సంవత్సరం (నవంబరు 1 నుంచి అక్టోబరు 31వరకు) మొత్తంగా గెలల ధరలు దిగజారాయి మినహా పెరగలేదు. ప్రస్తుతం సెప్టెంబరు నెలకు రూ.12,231గా నిర్ణయించారు. మూడేళ్ల కనిష్ఠానికి ధర దిగజారినట్లయ్యింది. అంతర్జాతీయ మార్కెట్‌ను అనుసరించి నెలనెలా ఆయిల్‌పాం ధరలు మారుతుంటాయి. ఇతర దేశాల నుంచి వచ్చే ముడిచమురుపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయడంతో లక్షలాది టన్నులు మనదేశంలోకి దిగుమతి అవుతున్నాయి. ముడిచమురు పేరుతో సింగిల్ రిఫైన్డ్ ఆయిల్ దిగుమతి చేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నా 'చెవిటివాని ముందు శంఖం ఊదినట్లే' ప్రభుత్వ తీరు ఉందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.నానాటికీ దిగజారి..గత నాలుగేళ్ల ధరలను పరిశీలిస్తే.. 2020లో డిసెంబరులో గరిష్ఠ ధర రూ.12,800. కనిష్ఠంగా ఆ ఏడాది రూ.9,348 (జూన్‌లో) పలికింది. 2021 జూన్‌లో రూ.19,114 జనవరిలో కనిష్ఠం రూ.14,416 ధర లభ్యమైంది. 2022 జూన్‌లో గరిష్ఠంగా రూ.23,467, అక్టోబరులో కనిష్ఠం రూ.12,996 ధర నమోదైంది. 2023 ఏప్రిల్‌లో గరిష్ఠం రూ.14,205 నమోదవగా ప్రస్తుతం సెప్టెంబరు మాసానికి రూ.12,231గా ధర నిర్ణయమైంది. ఈ ఏడాది పదో నెల వచ్చినా ఇంతవరకూ 15వేల ధరను అధిగమించలేదు. ఈ ప్రభావం కొత్తగా తోటలు వేసే రైతులపై స్పష్టంగా పడుతోంది.

రైతుల్లో నిరుత్సాహం..ఏడాదిన్నర కాలంగా దోబూచులాడుతున్న గెలల ధరతో కొత్తగా తోటలు వేయాలనుకునే రైతులు ఉత్సాహంగా ముందుకు రావడంలేదు. కిందటేడాది వరకూ సిఫార్సులు ఉన్నా మొక్కలు దొరికే పరిస్థితి లేదు. అయితే ప్రస్తుతం నర్సరీల్లోనే మొక్కలు లక్షలాదిగా నిల్వ ఉండిపోయాయి. ఇంకా ధరలు దిగజారితే వేసిన తోటలనూ రైతులు తొలగించే ప్రమాదమూ లేకపోలేదు. ఇప్పటికే రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు.

ముడి చమురు దిగుమతులు పెరిగి..

కొంతకాలంగా దేశంలోకి ముడిచమురు దిగుమతులు గణనీయంగా పెరిగాయి. ఆగస్టులోనే 1.10 మిలియన్ టన్నుల ముడిచమురు మన దేశం దిగుమతి చేసుకున్నట్లు సమాచారం. దిగుమతి అయ్యే వంట నూనెల్లో(ముడిచమురు) 60శాతం పైగా పామాయిల్ ఉండటం విశేషం. ఇందులో అత్యధిక వాటా ఇండోనేషియా, థాయ్‌లాండ్, మలేషియా నుంచే వస్తోంది. ఈ నేపథ్యంలో దిగజారుతున్న ధరలతో దేశీయ ఆయిల్‌పాం రైతు బేజారెత్తుతున్నాడు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించకపోతే ఆయిల్‌పాం రైతులు మరింత గడ్డు పరిస్థితి ఎదుర్కోక తప్పదు.

# ఆకలి తీర్చేలా.. ఆసక్తి పెంచేలా..




ఖమ్మం : ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం అల్పాహార పథకం ఈనెల 6 నుంచి అమలుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు ప్రారంభించింది. తొలుత జిల్లాలోని ఒక పాఠశాలలో ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయాలని భావించారు. తర్వాత ఐదు పాఠశాలలను మాత్రమే ఎంపిక చేశారు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో పాఠశాల చొప్పున ఖమ్మం నియోజకవర్గంలోని రోటరీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాలేరులో జలగంనగర్ ఉన్నత పాఠశాల, మధిరలో కంభంపాడు, వైరాలో పీఎస్ వైరా, సత్తుపల్లిలో పీఎస్ సత్తుపల్లిలో అమలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ పథకం అమలును పర్యవేక్షించనున్నారు. ఇందులో భాగంగా ఆయన జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మతో కలిసి నగరంలోని రోటరీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు.

చదువులపై దృష్టి సారించేలా..

గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులు ఉదయం ఎలాంటి ఆహారం తీసుకోకుండానే పాఠశాలలకు రావడం వల్ల వారు అనేక సమస్యలతో బాధపడుతున్నారు. ఫలితంగా చదువులపై దృష్టి పెట్టలేకపోతున్నారు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో విజయవంతంగా నడుస్తున్న ఈ పథకం ఇక్కడ కూడా అమలు చేస్తే బాగుంటుందనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం పేద పిల్లల ఆకలిని తీర్చనుంది.

ఖమ్మంలో ప్రారంభించనున్న మంత్రి


6న ఉదయం 9 గంటలకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ గౌతమ్ కలిసి రోటరీనగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో అల్పాహార పథకాన్ని ప్రారంభించనున్నారు. జలగంనగర్ పాఠశాలలో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రారంభిస్తారు. అల్పాహారం అందించే బాధ్యతను అక్షయ పాత్రకు చెందిన హరేరామ హరే కృష్ణ సంస్థ తీసుకుంది. ఈనెల 5 నుంచి 13 వరకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహిస్తారు. ఈ వారం పాటు ఖమ్మంలో ఈ సంస్థ అల్పాహారం అందించనుంది. అలాగే ఇతర పాఠశాలల్లోనూ ఏర్పాట్లు చేశారు. ఇంటి నుంచి విద్యార్థులు పాఠశాలకు వచ్చిన తర్వాత ఉదయం 8.30 గంటల నుంచి 9 గంటల మధ్య వీరికి అల్పాహారం అందిస్తారు. ఇంటర్వెల్ సమయంలో రాగిజావ, మధ్యాహ్నం భోజనం ఎప్పటిలాగానే అందిస్తారు. అల్పాహారానికి సంబంధించిన మెనూలో ఇడ్లీలు, కిచిడి, పాయసం తదితర రకాలున్నాయి.

అన్ని ఏర్పాట్లు చేశాం..మోతుకూరి మధు, ప్రధానోపాధ్యాయుడు, రోటరీనగర్ జడ్పీహెచ్ఎస్

సీఎం అల్పాహార పథకానికి సంబంధించి పాఠశాలలో అన్ని ఏర్పాట్లు చేశాం. మా పాఠశాలలో మొత్తం 280 మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కలుగుతుంది. పరిసర ప్రాంతాల్లోని పేద విద్యార్థులే ఇక్కడ ఎక్కువగా చదువుకుంటున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు రెండు పర్యాయాలు వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. ఇలాంటి పథకాల వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఉదయం అల్పాహారం అవకాశం లేని విద్యార్థులకు ఈ పథకం ఒక వరం లాంటిది.

# అన్నింటా అతివలదే పైచేయి

ఖమ్మం : శాసనసభ ఎన్నికలకు కొద్ది రోజుల్లో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో ఓటరు తుది జాబితాను ఎన్నికల సంఘం వెలువరించింది. తాజా జాబితా ప్రకారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మహిళా ఓటర్లే అధికం. ఉభయ జిల్లాల్లో 21,41,387 మంది ఓటర్లుగా నమోదవగా వీరిలో 10,99,548 మంది మహిళలు, 10,41,726 మంది పురుషులు ఉన్నారు. పది నియోజకవర్గాల్లోనూ అతివలదే పైచేయి. ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటముల్లో మహిళలే నిర్ణయాత్మక శక్తిగా మారనున్నారు.ఖమ్మం, పాలేరు, కొత్తగూడెం నియోజకవర్గాలు జనరల్ స్థానాలు. సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వ్‌డ్. వైరా, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు. గత నెలలో ప్రకటించిన ఓటరు జాబితాతో పోలిస్తే దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ కొంతమేర ఓటర్లు పెరిగారు. ఉభయ జిల్లాల్లో అత్యధిక ఓటర్లు (3,15,726) ఉన్న నియోజకవర్గంగా ఖమ్మం, అత్యల్ప ఓటర్లు (1,45,964) కలిగిన నియోజకవర్గంగా భద్రాచలం నిలిచాయి. ఓటరు నమోదు కోసం అధికార యంత్రాంగం చేసిన ప్రయత్నాలు కొంతమేర ఫలించాయి. ఉభయ జిల్లాల్లో 18-19 ఏళ్లు కలిగిన 66,300 మంది కొత్తగా ఓటర్లుగా నమోదయ్యారు.



పోలింగ్ కేంద్రాల లెక్క..

ఖమ్మం జిల్లాలో 1,439 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఖమ్మం నియోజకవర్గంలో 341, పాలేరు- 289, మధిర- 268, వైరా- 252, సత్తుపల్లి- 289 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈసీ ప్రకటించింది. భద్రాద్రి జిల్లాలో 1,095 పోలింగ్ కేంద్రాలున్నాయి. పినపాక- 241, ఇల్లెందు- 241, కొత్తగూడెం- 253, అశ్వారావుపేట- 184, భద్రాచలం- 176 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల సంఘం తాజాగా విడుదల చేసిన ఓటరు తుది జాబితాతోనే శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా ఓటరుగా నమోదయ్యేవారు జనవరి తర్వాత జరిగే ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.

# గ్రీన్ ఫీల్డ్.. భూసేకరణకు అడ్డంకులు

భూపాలపల్లి :రవాణా సౌకర్యాలను మెరుగుపర్చేందుకు కేంద్రం జాతీయ రహదారులను నిర్మిస్తోంది. ఇందులో భాగంగా మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను అనుసంధానించే నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి (163జీ) ప్రధానమంత్రి గతిశక్తి పథకం ద్వారా నిధులు కేటాయిస్తున్నారు. మూడు రాష్ట్రాల మీదుగా వెళ్లే జాతీయ రహదారి నిర్మాణ పనులకు గత జులై 8న హనుమకొండలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. ఈ భారీ ప్రాజెక్టుకు అడుగడుగునా భూసేకరణ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ రహదారి దాదాపు పంట పొలాలు, చేల మీదుగా వెళ్తుండటంతో రైతులు వ్యతిరేకిస్తున్నారు. చాలాచోట్ల భూములు ఇవ్వబోమని చెబుతున్నారు.

అభ్యంతరాలు..మూడేళ్లుగా గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారికి నేషనల్ హై వే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ఆధ్వర్యంలో సర్వేలు చేపడుతున్నారు. ఆది నుంచి రైతులు ఈ రహదారిపై అభ్యంతరాలు చెబుతున్నారు. సర్వేలు, మట్టి నమూనాల సేకరణ నాటి నుంచే ప్రతిచోటా రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. సర్వేల సమయంలో అధికారులకు అడ్డుపడుతూ.. ఆత్మహత్య చేసుకుంటామంటూ పురుగు మందు డబ్బాలతో ఆందోళనలు చేశారు. జిల్లాల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి సర్వేను ఆపి, మరో ప్రాంతం గుండా రహదారిని మళ్లించాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. మొగుళ్లపల్లి, నెక్కొండ, గట్లకానిపర్తి, పుట్టపాక తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ భూములు ఇవ్వబోమని చెబుతూ అభిప్రాయాన్ని వెల్లడించారు.

నిర్మాణం ఇలా..మంచిర్యాల-వరంగల్ వరకు 108.34 కిలోమీటర్ల



మేర జాతీయ రహదారిని మూడు ప్యాకేజీలుగా విభజించి నిర్మించనున్నారు. దీని అంచనా వ్యయం రూ.2606 కోట్లు. ఈ రహదారి నిమిత్తం దాదాపు 589 హెక్టార్ల భూమి సేకరించనున్నారు.వరంగల్-ఖమ్మం వరకు 108.23 కిలోమీటర్లు కాగా, అంచనా వ్యయం రూ.2,299 కోట్లు. దీనికోసం 568 హెక్టార్ల భూమి సేకరించనున్నారు.

నాలుగు జిల్లాల మీదుగా..జయశంకర్ భూపాలపల్లి: చిట్యాల మండలం కాల్వపల్లిలో మొదలై టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల మీదుగా..హనుమకొండ: పరకాల శాయంపేట, దామెర, ఆత్మకూరు, గీసుకొండ మండలాల నుంచి..

వరంగల్: సంగెం, నెక్కొండ మీదుగా..

మహబూబాబాద్: కేసముద్రం, మహబూబాబాద్, కురవి, సీరోలు మండలాల మీదుగా వెళ్తూ డోర్నకల్ మండలం వెన్నారంలో ముగుస్తుంది. అక్కడి నుంచి ఖమ్మం జిల్లా వెంకటాయపాలెం నుంచి విజయవాడ వరకు సాగుతుంది.రైతుల ఆవేదన..ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం ప్రాంతాల వారీగా ఎకరానికి రూ.10 లక్షల నుంచి రూ. 4 కోట్ల వరకు పలుకుతోంది. ప్రభుత్వం ఇచ్చే ధరతో పోల్చితే సగం వరకు కూడా రాదని రైతులు చెబుతున్నారు. తమ భూములను వదిలి ప్రభుత్వ భూముల మీదుగా రహదారిని నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రీన్ ఫీల్డ్ కాకుండా, బ్రౌన్ ఫీల్డ్ (ప్రస్తుతం ఉన్న రహదారుల విస్తరణ) చేపట్టాలని కోరుతున్నారు.న్యాయం కోసం..మంచిర్యాల-ఖమ్మం వరకు ఉన్న రైతులు ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేస్తున్నారు. దీనిపై హైకోర్టు, ఎన్‌జీటీకి సైతం వెళ్లారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, కిషన్ రెడ్డిలను కలిసి రహదారిని పంట పొలాల మీదుగా కాకుండా ప్రత్యామ్నాయం చూడాలని కోరారు.రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని, దీనివల్ల ప్రయోజనాలుంటాయని ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో భూసేకరణకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తామని చెబుతున్నారు. నిర్వాసితుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నా, పరిహారం డిపాజిట్ చేసి పనులు చేపట్టే అవకాశం ఉందని తెలిసింది. హైకోర్టు, ఎన్‌జీటీలో విషయం తేలాల్సి ఉంది.

## యూరియాకు అధిక ధర

భూపాలపల్లి : రైతుల అవసరాలను ఆసరా చేసుకొని వ్యాపారులు యూరియాను ధరలు పెంచి అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గరిష్ఠ ధర కంటే బస్తాకు రూ.30-40 ఎక్కువకు విక్రయిస్తున్నారు. వ్యవసాయ అధికారులు కనీసం స్పందించడం లేదు. సాగు విస్తీర్ణాన్ని బట్టి జిల్లాకు వచ్చిన యూరియాను అధికారులు మండలాల వారీగా కేటాయిస్తారు. రవాణా, హమాలీ కూలీలు కలుపుకొని బస్తా యూరియా రూ.266కు విక్రయించాల్సి ఉండగా.. సొసైటీల్లో రూ.270 వరకు విక్రయిస్తున్నారు. అదే ప్రైవేటు దుకాణాల్లో వ్యాపారులు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో రూ.300 నుంచి రూ.310 వరకు విక్రయిస్తున్నారు. కొందరు కృత్రిమ కొరత సృష్టించి, నల్లబజారులో అధిక ధరకు విక్రయించి లాభాలు గడిస్తున్నారు. నర్సంపేటలో బస్తాకు రూ.300 తీసుకున్నారని నాగుర్లపల్లి



గ్రామానికి చెందిన రైతు రాజయ్య చెప్పారు. ఇక గ్రామాల్లో అయితే రూ.310-320 దాక విక్రయిస్తున్నారు. నర్సంపేట పట్టణం నెక్కొండ రోడ్డులోని ఓ రైతు సేవా కేంద్రంలో 12 బస్తాల యూరియాను బస్తాకు రూ.300 చొప్పున ఇచ్చారని, దానికి పురుగు మందు కూడా అంటగట్టారని కొత్తగూడ రైతు మల్లేశం తెలిపారు. దీనిపై నర్సంపేట మండల వ్యవసాయ అధికారి కృష్ణను వివరణ కోరగా.. యూరియా అధిక ధరకు అమ్మినా, ఇతర పురుగు మందు లింకులు పెట్టి విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారిపై చర్యలు చేపట్టేలా చూస్తామన్నారు.




## ఇది కొత్త భారతం.. వంద పతకాలతో చరిత్ర

హాంగ్‌జౌ: ఆసియా క్రీడల్లో భారత్ కొత్త చరిత్ర సృష్టించింది. మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి శత పతకాలు సాధించింది. ఇవాళ మహిళల కబడ్డీ ఫైనల్‌లో చైనీస్ జట్టును చిత్తు చేస్తూ భారత్ స్వర్ణంతో మెరిసింది. అలాగే ఆర్చరీ ఈవెంట్‌లో శనివారం మొత్తం నాలుగు పతకాలను భారత్ కైవసం చేసుకుంది. ఆర్చరీ మహిళల విభాగంలో తెలుగమ్మాయి జ్యోతి సురేఖ పసిడి పట్టేసింది.
ఇదే అర్చరీ విభాగంలో అదితి గోపీచంద్ కాంస్యం సాధించింది. మరోవైపు ఆర్చరీ పురుషుల విభాగంలో ఓజాస్ డియోటేల్ స్వర్ణం గెలుచుకోగా.. అభిషేక్ రజతం సాధించాడు. దీంతో ఇప్పటివరకు భారత్ గెలుచుకున్న పతకాల సంఖ్య 100కి చేరింది. ఇందులో స్వర్ణం-25 రజతం- 35 కాంస్యం- 40 పతకాలు ఉన్నాయి. దీంతో ఆసియా క్రీడల పతకాల పట్టికలో భారత్ 4 స్థానంలో కొనసాగుతోంది.




## ‘శతక’ వీరులను చూసి దేశం గర్విస్తోంది.. వారిని అప్పుడు కలుస్తా: ప్రధాని మోదీ

ఆసియా క్రీడల్లో తొలిసారి భారత్ ‘వంద’ పతకాల మార్క్‌ను తాకింది. ఇంకా మరికొన్ని పతకాలు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అథ్లెట్లపై ప్రశంసల వర్షం కురిపించారు. దేశం గర్వపడేలా చేశారని కొనియాడారు. ఆసియా క్రీడలు ముగిసిన తర్వాత అక్టోబర్ 10న అథ్లెట్లకు ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ప్రధాని స్వయంగా వెల్లడించారు. “ఆసియా క్రీడల్లో భారత్ అద్భుతం చేసింది. పతకాల సంఖ్య 100కి చేరడంతో దేశ ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. మన అథ్లెట్ల కృషికి నా హృదయ పూర్వక అభినందనలు చెబుతున్నా.

మమ్మల్ని గర్వపడేలా చేశారు. 10వ తేదీన మా ఆసియా క్రీడల బృందానికి ఆతిథ్యం ఇవ్వడానికి.. మన అథ్లెట్లతో సంభాషించడానికి ఎదురుచూస్తున్నా” అని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ప్రస్తుతం భారత్ సాధించిన 100 పతకాల్లో 25 స్వర్ణాలు, 35 రజతాలు, 40 కాంస్య పతకాలు ఉన్నాయి.

# ముగిసిన సీఎం జగన్ ఢిల్లీ పర్యటన



ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ముగిసింది. గురువారం ఉదయం ఢిల్లీకి వెళ్లిన ఆయన.. ఈ ఉదయం ఢిల్లీ నుంచి ఏపీకి తిరుగుపయనం అయ్యారు. శుక్రవారం కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగిన వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల సమావేశంలో హాజరు కావడంతో పాటు.. పలువురు కేంద్ర మంత్రుల్ని కలిసి ఏపీకి సంబంధించిన వ్యవహారాలపై చర్చలు జరిపారాయన. ఏపీకి రావాల్సిన నిధులు, బకాయిలతో పాటు పోలవరం.. వివిధ అంశాలను సీఎం జగన్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. తొలుత కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో, ఆపై కేంద్రం విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్‌తో భేటీ అయ్యారాయన. ఈ సందర్భంలో.. ఏపీ విద్యుత్ రంగ అభివృద్ధిపై మంత్రి ఆర్కే సింగ్ ప్రశంసలు గుప్పించారు. ఆపై నిన్న(శుక్రవారం) ఢిల్లీలో వామపక్ష తీవ్రవాద నిర్మూలన సదస్సులో.. ఏపీ నుంచి సీఎం జగన్, సీఎస్, డీజీపీ పాల్గొన్నారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులపై రాష్ట్రాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న కేంద్రం.. అక్కడ అభివృద్ధి పనులపై ఫోకస్ పెట్టేందుకు రాష్ట్రాలకు పలు సూచనలు చేసింది. ఈ సదస్సులో సీఎం జగన్ సైతం ప్రసంగించారు. ఈ సదస్సు తర్వాత నిన్న సాయంత్రం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో దాదాపు దాదాపు గంటపాటు సమావేశం అయ్యారు సీఎం జగన్. ఏపీకి రావాల్సిన నిధులు, బకాయిలతో పాటు వివిధ అంశాలపై వారు చర్చించినట్లుగా తెలుస్తోంది.

## ఏపీలో జగన్ అరాచకాలకు పోలీసు వ్యవస్థ కాపలా కాస్తోంది: కన్నా



గుంటూరు: రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ మొత్తం సీఎం జగన్ అరాచకాలకు కాపలా కాస్తోందని తెదేపా నేత, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ గుంటూరులో తలపెట్టిన శాంతి ర్యాలీకి వెళ్లకుండా పోలీసులు కన్నాను గృహ నిర్బంధం చేశారు. దీనిపై మీడియాతో మాట్లాడిన ఆయన.. ముఖ్యమంత్రి, పోలీసుల తీరుపై మండిపడ్డారు.

జగన్ సీఎం అయ్యాక రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని దుయ్యబట్టారు. పోలీసు ల అండతో విపక్షాలను వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వేల సంఖ్యలో మహిళలు, చిన్న పిల్లలు అదృశ్యమవుతున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు.. ముఖ్యమంత్రి అరాచకాలకు అండగా నిలవడంతోనే సరిపోతోందని ఎద్దేవా చేశారు.

## ఓటర్ల జాబితాలో అక్రమాలు.. అచ్చెన్నాయుడు రాసిన లేఖపై స్పందించిన ఈసీ



అమరావతి : ప్రకాశం జిల్లా పర్చూరు, నెల్లూరు జిల్లా కావలిలో ఓటర్ల జాబితాలో అక్రమాలపై ఎన్నికల కమిషన్ సీరియస్ అయ్యింది. ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు లేఖపై కమిషన్ స్పందించింది. తీసుకున్న చర్యలపై అచ్చెన్నాయుడుకి చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా లేఖ రాశారు. పర్చూరులో వేరే వ్యక్తుల పేర్లపై ఆన్‌లైన్‌లో ఫామ్-7 లు పంపిన 12 మంది పై క్రిమినల్ కేసులను నమోదు చేశారు. ఇప్పటికే పర్చూరు ఈఆర్వో పిర్యాదు చేశారని లేఖలో కమిషన్ పేర్కొంది. బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ దర్యాప్తు చేసి నివేదిక ఇచ్చారని మీనా పేర్కొన్నారు. ఈ నివేదిక ప్రకారం నకిలీ ఫామ్-7 లు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకున్నట్టు మీనా పేర్కొన్నారు. కావలి నియోజకవర్గంలో అక్రమాలపై అచ్చెన్నాయుడు రాసిన లేఖపై కూడా కమిషన్ స్పందించింది. కావలిలో కూడా బల్క్‌గా ఫామ్-7 లు ఇచ్చి టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించారని పేర్కొంటూ లేఖ రాశారు. కావలిలో అక్రమాలపై విచారణకు ఆదేశించినట్లు కమిషన్ పేర్కొన్నారు. వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్టు లేఖలో సీఈవో మీనా వివరించారు.

## ఐటీ కంపెనీలు ఏపీకి పంపిస్తామనడం కాదు.. నీటి సంగతేంటి కేటీఆర్?

అనంతపురం : తెలంగాణ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజా నాథ్ కౌంటర్ ఇచ్చారు. ఐటీ కంపెనీలు ఏపీకి పంపిస్తాం... స్థలాలు ఇప్పిస్తాం అని చెప్పడం కాదని నీటి వాటాల సంగతేంటని ప్రశ్నించారు. కేటీఆర్ ఐటీ కంపెనీలు ఏపీకి పంపిస్తామని చులకన భావనతో మాట్లాడడం.. తమ మనోభావాలను దెబ్బతీసిందన్నారు. కృష్ణా జలాల పంపిణీపై కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్ రాయలసీమకు చావు దెబ్బలాంటిదన్నారు. బీజేపీ అప్పర్ భద్ర ప్రాజెక్టును కర్ణాటక ఎన్నికల కోసం వాడుకుందని శైలజానాథ్ అన్నారు. ఇప్పుడు తెలంగాణ ఎన్నికల కోసమే కృష్ణా జలాల పంపిణీపై కొత్త నోటిఫికేషన్ బీజేపీ ఇచ్చిందన్నారు. రాయలసీమకు శ్రీశైలం నీటిని ఇవ్వాలన్నారు. హంద్రీనీవా గాలేరు నగరి ప్రాజెక్టులు మూతపడుతాయని శైలజానాథ్ అన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి వెళ్లడం కాదు.. రాష్ట్రానికి కావాల్సిన హక్కులను సాధించడం లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనం దృష్ట్యా అందరినీ కలుపుకుని పోయి నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. బీజేపీ దుర్మార్గాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని శైలజానాథ్ అన్నారు.




గుంటూరు: తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ.. తెదేపా-జనసేన సహా పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తలపెట్టిన ‘ధర్మాగ్రహ శాంతి ర్యాలీ’ ఉద్రిక్తంగా మారింది. శాంతిర్యాలీ నిర్వహించకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. బలగాలు భారీగా మోహరించినప్పటికీ.. చంద్రబాబు అభిమానులు, పార్టీ కార్యకర్తలు పోలీసు వలయం ఛేదించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నక్కా ఆనంద్‌బాబు, జీవీ ఆంజనేయులు, కొమ్మాలపాటి శ్రీధర్, జనసేన నేత శ్రీనివాస్ యాదవ్, పెద్ద ఎత్తున మహిళా రైతులు పాల్గొన్నారు. ముందస్తు పిలుపు మేరకు లాడ్జి సెంటర్‌కు చేరుకున్న కార్యకర్తలు శాంతి ర్యాలీ నిర్వహించకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. లాడ్జిసెంటర్ నుంచి అరండల్‌పేట వరకు సుమారు 800 మంది పోలీసులు మోహరించి.. నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. రాజకీయ కక్షతోనే చంద్రబాబును అరెస్టు చేశారని కార్యకర్తలు మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లాడ్జి సెంటర్ నుంచి మార్కెట్ వద్ద ఉన్న హిమని సెంటర్ వరకు శాంతి ర్యాలీ చేస్తామని తెదేపా నాయకులు.. ఎస్పీని కలిసి ఇదివరకే అనుమతి కోరారు. దీనిపై గుంటూరు వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి స్పందిస్తూ.. ఆ ర్యాలీకి ప్రభుత్వ, పోలీసుల పరంగా అనుమతి లేదని శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 31 పోలీసు యాక్టుతో పాటు 144 సెక్షన్ అమల్లో ఉందని, ర్యాలీలు, సభలు నిషిద్ధమని తేల్చి చెప్పారు. ఈ మేరకు ర్యాలీకి రావొద్దని రాజకీయ పార్టీల నేతలకు నోటీసులు అందజేశారు. అయితే పోలీసులు ముందస్తు అరెస్టులు చేయకుండా తెదేపా, జనసేన, సీపీఐ నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణను ఇంటి నుంచి వెళ్లకుండా పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా శాంతి ర్యాలీ జరుగుతుందని మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందన్నారు. శాంతియుతంగా ర్యాలీ చేస్తామంటే పోలీసులు అనుమతి ఇవ్వలేదని.. అనుకున్న సమయానికి అందరూ లాడ్జి సెంటర్‌కు రావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున లాడ్జి సెంటర్‌కు కార్యకర్తలు చేరుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు.




జెరూసలెం: ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య ఉద్రిక్తతలు మళ్లీ భగ్గుమన్నాయి. శనివారం ఉదయం గాజా నుంచి ఇజ్రాయెల్‌పైకి వేలాది రాకెట్లు దూసుకొచ్చాయి. అటు పాలస్తీనాకు చెందిన హమాస్ మిలిటెంట్లు చొరబాటుకు దిగారు. దీంతో అప్రమత్తమైన ఇజ్రాయెల్ సైన్యం ప్రతిదాడికి దిగింది. తాజా పరిణామాలతో ఇజ్రాయెల్‌లో యుద్ధ మేఘాలు అలుముకున్నట్లు సైన్యం ప్రకటించింది.

వివాదాస్పద గాజా స్ట్రిప్ ప్రాంతంలో ఉన్న పాలస్తీనా మిలిటెంట్లు శనివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్‌పై రాకెట్ల వర్షం కురిపించారు. జెరూసలెం, టెల్ అవివ్ సహా దేశవ్యాప్తంగా ఎయిర్ రైడ్ సైరన్ల మోత మోగింది. కేవలం 20 నిమిషాల వ్యవధిలోనే వేలాది రాకెట్లను ప్రయోగించారు. దీంతో పలు ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించాయి. ఆ తర్వాత కాసేపటికే పాలస్తీనా మిలిటెంట్లు తమ భూభాగాల్లోకి చొచ్చుకొచ్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. సరిహద్దుల్లోని ప్రజలంతా ఇళ్లల్లోని ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రావొద్దని హెచ్చరించింది.

**5వేల రాకెట్ల వర్షం..** ఇజ్రాయెల్‌పై మిలిటరీ ఆపరేషన్‌ను ప్రారంభించామని హమాస్ మిలిటరీ వింగ్ హెడ్ మొహమ్మద్ డెయిఫ్ ప్రకటించాడు. ఈ తెల్లవారుజామునే ‘ఆపరేషన్ ఆల్-అక్సా స్ట్రామ్’ ప్రారంభమైందని, ఇప్పటివరకు 5వేల రాకెట్లను ప్రయోగించామని డెయిఫ్ చెప్పినట్లు ఓ వీడియో సందేశం బయటికొచ్చింది. డెయిఫ్‌పై గతంలో అనేకసార్లు దాడులు జరిగాయి. దీంతో కొంతకాలంగా బయటి ప్రపంచానికి దూరంగా ఉంటున్న అతడు ఇప్పుడిలా వీడియో విడుదల చేయడం.. యుద్ధ తీవ్రతను అద్దం పడుతోంది.

**ప్రతి దాడికి దిగిన ఇజ్రాయెల్..** హమాస్ మిలిటెంట్ గ్రూప్ ప్రకటనతో ఇజ్రాయెల్ సైన్యం అప్రమత్తమైంది. గాజా స్ట్రిప్‌లోని హమాస్ స్థావరాలపై ప్రతిదాడులు చేపట్టినట్లు వెల్లడించింది. మిలిటెంట్లు ప్రయోగించిన రాకెట్లను కూల్చేందుకు యాంటీ రాకెట్ డిఫెన్స్ వ్యవస్థను యాక్టివేట్ చేసింది. దీంతో పేలుడు శబ్దాలు భారీగా వినిపిస్తున్నాయి. తాము యుద్ధానికి సిద్ధగా ఉన్నామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

**హమాస్ అధీనంలో పోలీస్ స్టేషన్..** అటు ఇజ్రాయెల్-గాజా సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాజా స్ట్రిప్‌లో స్వాధీనం చేసుకున్న ఇజ్రాయెల్ ఆర్మీ వాహనాలు, పారాచ్యూట్లతో హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్ భూభాగంలోకి చొచ్చుకొచ్చారు. సరిహద్దుల్లోని ఓ పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి దాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. అటు ఇజ్రాయెల్ సైన్యం, హమాస్ మిలిటెంట్ల మధ్య భీకర కాల్పులు జరుగుతున్నాయి. ఈ కాల్పుల్లో పలువురు సామాన్య పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మృతుల సంఖ్య భారీగానే ఉండొచ్చని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. సరిహద్దుపై ఇజ్రాయెల్ సైన్యం నియంత్రణ కోల్పోయినట్లు సమాచారం. 1967 అరబ్-ఇజ్రాయెల్ యుద్ధంలో తూర్పు జెరూసలెం, గాజా ప్రాంతాలను ఇజ్రాయెల్ సైన్యం స్వాధీనం చేసుకుంది. స్వతంత్ర పాలస్తీనాలో ఆ రెండు ప్రాంతాలూ అంతర్భాగాలు కావాలనే డిమాండ్‌తో పాలస్తీనా తిరుగుబాటు చేస్తోంది.

## వీకెండ్ రానే వచ్చేసింది. కానీ తిరుమలలో సీన్ రివర్స్..

తిరుమలలో భక్తుల రద్దీ తగ్గింది. అసలు వీకెండ్‌లో భక్తుల రద్దీ బీభత్సంగా ఉంటుంది. కానీ నేడు తిరుమలలో సీన్ రివర్స్ అయ్యింది. ఈ శనివారం మాత్రం భక్తుల రద్దీ ఏమాత్రం లేదు. క్యూలో కూడా భక్తులు పెద్దగా లేకపోవడంతో శ్రీవారి దర్శనానికి భక్తుల్ని నేరుగా దర్శనానికి అనుమతిస్తున్నారు. శ్రీవారి దర్శనానికి కేవలం మూడు గంటల సమయం మాత్రమే పడుతోంది. ఇక శుక్రవారం శ్రీవారిని 72,104 మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం 3.8 కోట్ల రూపాయలు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. ఇక నిన్న శ్రీవారికి 25,044 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కాగా.. ఈ నెల 14 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. 15 నుంచి 23 వరకూ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 23 న చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.




ఎయిరిండియాను కొనుగోలు చేసిన నాటి నుంచి దాని అభివృద్ధిలో భాగంగా వివిధ మార్పులకు శ్రీకారం చుడుతున్న టాటా గ్రూప్.. ఇటీవల సంస్థ లోగో, ఎయిర్‌క్రాఫ్ట్ లివరీ (విమానాల రూపు)లో మార్పులు చేసింది. ఈ నయా లుక్‌లోకి మారిన విమానాల ఫస్ట్ లుక్‌ను తాజాగా సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ఫ్రాన్స్‌లోని టౌలోసి వర్క్‌షాప్‌లో కొత్త లోగో, డిజైన్‌తో సరికొత్తగా తీర్చిదిద్దిన ఏ350 విమానం ఫొటోలను ఎయిరిండియా తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసింది. ఈ శీతాకాలానికి ఏ350 విమానాలను స్వదేశానికి తీసుకురానున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ‘ద విస్టా’గా వ్యవహరించే కొత్త లోగోలో పసిడి వన్నె మహారాజా మస్కట్ విండో ఫ్రేమ్‌ను ఉంచారు. అపరిమిత అవకాశాలు, ప్రగతిశీలత, భవిష్యత్తుపై విమానయాన సంస్థకు ఉన్న విశ్వాసం, ధైర్యానికి సంకేతంగా ఈ కొత్త లోగోను రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. లోగోలో ఎయిరిండియా ఫాంట్‌ను కూడా మార్చారు. దీనికోసం సొంతంగా ‘ఎయిర్ ఇండియా శాన్స్’ ఫాంట్‌ను డిజైన్ చేశారు. అలాగే ఎరుపు, ఊదారంగు, పసిడి వర్ణం డిజైన్‌లతో విమానాల డిజైన్‌ను మార్చారు. ఎయిరిండియా తొలి ఏ350 విమానాన్ని ఈ నయా లుక్‌లో తీర్చిదిద్దారు. తమ ఫ్లీట్‌లో ఉన్న పాత విమానాలన్నింటినీ కూడా ఈ కొత్త డిజైన్‌లోకి మార్చనున్నట్లు ఎయిరిండియా తెలిపింది. ఇందుకోసం 400 మిలియన్ డాలర్లు ఖర్చు చేయనున్నట్లు తెలుస్తోంది.
సంస్థకు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు అమలుచేస్తున్న ప్రణాళికలో భాగంగానే ఈ మార్పులు చేసినట్లు కంపెనీ గతంలో వెల్లడించింది. ఈ ఏడాది డిసెంబరు నుంచి కొత్త లోగోతో కొన్ని విమాన సర్వీసులు మొదలుకానున్నాయి. 2025 నాటికి ఎయిరిండియాలోని అన్ని విమానాలను కొత్త లోగోలోకి మార్చనున్నట్లు కంపెనీ తెలిపింది.

## పింక్ టైట్ లో రితికా సింగ్ పేంపరింగ్!

'గురు' బ్యూటీ రితికా సింగ్ ఇన్ స్టా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. టెంప్టింగ్ ఫోటోలతో కుర్రాళ్ల గుండెల్లో గుబులు పుట్టిస్తుంది. మిగతా భామలకంటే సమ్ థింగ్ స్పెషల్ గా డిఫరెంట్ గా ఫోకస్ అవ్వాలని ట్రై చేస్తుంటుంది. బేసిక్ గామార్షల్ ఆర్ట్స్ ట్రైన్డ్ బ్యూటీ కావడంతో ఎక్కువగా జిమ్ ఫోటోల్ని షేర్ చేస్తుం టుంది. అందులోనే కొత్తదనాన్ని వెతుకుతుంది. ఈ క్రమంలో వైవిధ్యంగా ఇన్ స్టాలో కిక్కిచ్చేలా ప్లాన్ చేసుకుంటుంది. రంగు రంగుల స్కిన్ టైట్ దుస్తుల్లో కనిపించడానికి ఆసక్తి చూపిస్తుంది. తాజాగా అమ్మడు పింక్ వర్ణం టైట్ దుస్తుల్లో సెగలు పుట్టిస్తోన్న ఓ ఫోటో అంతర్జాలంలోకి వదిలింది. ఇదిగో ఇక్కడిలా రూమ్ లో ముందుగా ముస్తాబైన ఫోటోని షేర్ చేసింది. బ్లాక్ స్పోర్ట్స్ ధరించి..ఆ పై గులాబీ రంగు స్కిన్ టైట్ దుస్తుల్లో అందాల న్నింటిని ఫోకస్ చేసింది. వార్మప్ చేస్తోన్న ఓ ఫోజుని



ఇలా నెట్టింట వదిలింది. రెండుచేతులు సగం చాచి ఓ చేతిలో ఐస్ క్రీమ్..మరో చేతిలో పుల్ల తో కనిపిస్తుంది...కుడి కాలు పైకెత్తి చూసారా? నా వార్మప్ స్పెషాల్టీ అంటూ చెప్పకనే చెప్పింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. దీంతో ఫాలోవర్ల కామెంట్లకు తిరుగు లేకుండా పోతుంది. ఇక ఈ బ్యూటీ కెరీర్ విషయానికి వస్తే.. ఇటీవలే నటించిన 'కింగ్ ఆఫ్ కొత్త' రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. మాలీవుడ్ సినిమా అయినా అనువాద రూపంలో తెలుగులోనూ రిలీజ్ అయింది. కానీ ప్రేక్షకుల్ని మెప్పించడంలో విఫలమైంది. తాజాగా ఇటీవలే తలైవార్ 170వ ప్రతిష్టాత్మక చిత్రంలో ఛాన్స్ అందుకుంది. ఇందులో రజనీకాంత్ తో పాటు టాప్ స్టార్లు కూడా భాగం అవుతున్నారు. అలాంటి ప్రాజెక్ట్ లో రితిక ఛాన్స్ అందుకోవడంతో మరోసారి అమ్మడి పేరు హాట్ టాపిక్ గా మారింది. ఈ ఛాన్స్ ఎలా సాధ్యమంటూ ఆశ్చర్యపోతున్నారు. కానీ రితిక ట్యాలెంట్ పెర్మార్మర్ అని తొలి సినిమాతోనే రుజువు చేసుకుంది.

## దేవయాని స్కూల్ టీచర్ గా పనిచేస్తుందా?

వెటరన్ నటి దేవయానీ గురించి పరిచయం అవసరం లేదు. తెలుగు..హిందీ..తమిళ..మలయాళ..కన్నడ చిత్రాల్లో నటించారు. 'సుస్వాగతం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే తెలుగు నాట ఎంతో పాపులర్ అయిన నటి ఆమె. ఆ తర్వాత చాలా సినిమాలు చేసారు. 'ఎన్టీఆర్ కథానాయ కుడు'..'లవ్ స్టోరీ'..'జనతా గ్యారేజ్' లాంటి చిత్రాల్లోనూ ఈ మధ్య కాలంలో నటించారు. అలాగే టీవీ సీరియల్స్..షోస్ కూడా చేసారు. మరి ఇంత ఫేమస్ అయిన నటి ఓ స్కూల్ టీచర్ గా జీవనం సాగిస్తున్నారు? అంటే నమ్ముతారా? కానీ నమ్మాల్సిన నిజమిది. తమిళనాడులోని అన్నాసాలై లో గల చర్చికాన్వెంట్ పాఠశాల్లో ఆమె నర్సరీ పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. అందుకు గాను దేవయానికి



పదివేలు జీతం చెల్లిస్తున్నారు. మరి ఒకప్పటి హీరోయిన్ ఇప్పుడిలా పాఠాలు బోధించడం ఏంటి? అంటే ఆమెకు టీచర్ ఉద్యోగం అంటే ఎంతో ఇష్టం. తొలుత ఆమె పదవ తరగతి వరకూ చదువుకున్నారు. ఆ తర్వాత అనివార్య కారణాలతో సినిమాల్లోకి వచ్చారు. అక్కడ సక్సెస్ అయిన తర్వాత తమిళ దర్శకుడు రాజ్ కుమార్ నన్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఇలా పెళ్లి చేసుకోవడం దేవయానికి తల్లిదండ్రులకు ఇష్టం లేదు. ఇప్పటికీ అల్లుడికి-అత్తింటి కుటుంబానికి మాటల్లేవ్. దేవయాని మాత్రమే తల్లిదండ్రులకు టచ్ లో ఉంటుంది. వివాహం తర్వాత దేవయానికి అవకాశాలు కూడా తగ్గాయి. అలాగే ఉన్న డబ్బుతో నిర్మాణంలోకి దిగి నష్టపోయారు. ఈ క్రమంలోనే మళ్లీ సినిమాల్లో నటించి అప్పులు తీర్చారు. ఇదే సమయంలో టీచర్ ఉద్యోగానికి కావాల్సిన అర్హతలు సంపాదించారు. అయితే రంగుల జీవితం ఎప్పుడూ సాఫీ కాదు కదా. ఇప్పుడా టీచర్ ఉద్యోగమే కుటుంబ పోషణకు ఆధారమైంది అన్నది కొందరి వాదన కాగా..కేవలం ఆ ఉద్యోగం పై ఇష్టంతోనే చేస్తుంది తప్ప! డబ్బులు కోసం కాదని మరికొంత మంది అంటున్నారు. ఏది ఏమైనా తెలిసిన పనిచేయడంలో తప్పు లేదు. ఇండస్ట్రీకొచ్చి కోట్లు సంపాదించిన ఎంతో మంది చివరి నిమిషంలో ఆర్థిక ఇబ్బందులు పడిన వారు ఎంతో మంది ఉన్న సంగతి తెలిసిందే.




## లోకేశ్ మార్క్ యాక్షన్.. వైల్డ్‌గా లియో ట్రైలర్




తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ - విక్రమ్ ఫేమ్? దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబోలో తెరకెక్కిన లేటెస్ట్? భారీ యాక్షన్ ఎంటర్?టైనర్? మూవీ 'లియో'. అక్టోబర్ 19న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అయింది. ఈ నేపథ్యంలో తాజాగా లియో ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ప్రచార చిత్రం ఆద్యంతం.. లియోదాస్ అండ్ పార్దిగా విజయ్ యాక్టింగ్, ఆయనపై షూట్ చేసిన యాక్షన్ సీక్వెన్స్ హై ఓల్టేజ్‌లో ఉన్నాయి.


ఇక అర్జున్ పై షూట్ చేసిన సీన్స్ కూడా ఆకట్టుకునే రేంజ్?లో ఉన్నాయి. ముఖ్యంగా అనిరుధ్ అందించిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ అదిరిపోయింది.

"సీరియల్ కిల్లర్ నడిరోడ్డు మీద గుడ్డిగా షూట్ చేస్తున్నాడు.. ఆల్రెడీ రోడ్డు మీద చాలా మంది చనిపోయారు. వాడు చాలా క్రూరుడు.. వాడు అందరిని కాలుస్తున్నాడు.. అప్పుడు దైర్యంగా ఒక పోలీస్ ఆఫీసర్ సింహంలా వచ్చి ఆ సీరియల్ కిల్లర్‌ను కాల్చాడు. ఇప్పుడు ఆ ఆఫీసర్ కాల్చిన గన్.. నీ చేతిలో ఉంది..'' అంటూ విజయ్ు వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ఈ వాయిస్ ఓవర్ ప్లే అవుతుండగానే యాక్షన్ సీన్స్‌ను అద్భుతంగా చూపించారు.

ఆ తర్వాత కిల్లర్‌ను చంపింది పార్దీ(విజయ్) అనుకుని విలన్స్ అతడిని, అతడి కుటుంబాన్ని చంపడానికి ప్రయత్నించడం, వారి నుంచి పార్ది తప్పించుకోని తిరగడం, ఆ తర్వాత చేసేదేమి లేక తిరగబడటం చూపించారు. అయితే కిల్లర్‌ను చంపింది తాను కాదని, తనలా ఉన్న మరోడని పార్దీ చెప్పడం, అంతలోనే వైల్డ్‌గా ఉన్న లియోదాస్ ( మరో విజయ్)ను చూపించడం అంతా పవర్ ఫుల్‌గా సాగింది. అసలు ఈ లియో ఎవరు.. ? ఎందుకు సీరియల్ కిల్లర్‌ను చంపాడు. లియో, పార్దీ ఇద్దరు ఒకేలా ఎందుకు ఉ న్నారు? లేదా ఇద్దరు ఒకటేనా తెలియాలంటే సినిమా వచ్చే వరకు వేచి ఉండాల్సిందే. ఇకపోతే ఈ సినిమా అక్టోబర్ 19న వరల్డ్ వైడ్‌గా విడుదల కానుంది. మరి ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

## ఇంకోసారి ఆ డుంకితో పోల్చకండి బాబు





యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం సలార్ మూవీతో ప్రేక్షకుల ముందుకి రావడానికి సిద్ధం అవుతున్నాడు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా డిసెంబర్ 22న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్స్ లోకి రానుంది. భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా సిద్ధమవుతోన్న ఈ మూవీపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. అయితే సలార్ కి పోటీగా అదే రోజు షారుఖ్ ఖాన్ డుంకీ మూవీ కూడా రిలీజ్ కాబోతోంది. ఈ ఏడాది రెండు వరుస హిట్స్ తో మంచి జోరు మీద ఉన్న షారుఖ్ ఖాన్ ఓ వైపు ఆదిపురుష్ లాంటి డిజాస్టర్ తర్వాత ప్రభాస్ నుంచి వస్తోన్న సలార్ మరోవైపు పోటీ పడుతున్నాయి. కామన్ గా ఎవరైనా షారుఖ్ ఖాన్ డుంకీ మూవీ రిలీజ్ కోసం ఎక్కువ మంది ఆసక్తి చూపించే అవకాశం ఉందని భావిస్తారు. అయితే సరైన సక్సెస్ లేకపోయిన డార్లింగ్ ప్రభాస్ మీద ఆడియన్స్ ఎక్స్ పెక్టేషన్స్ మాత్రం తారాస్థాయిలో ఉన్నాయని చెప్పాలి. అప్ కమింగ్ రిలీజ్ కాబోయే సినిమాలలో బుక్ మై షో మోస్ట్ ఇంటరెస్ట్ చిత్రాల జాబితాలో సలార్ టాప్ లో ఉంది. ఈ సినిమా కోసం 3 లక్షల 62 వేల 8 వందల మది ప్రత్యేకంగా ఆసక్తి చూపిస్తున్నారు. రిలీజ్ కోసం వెయిట్ చేస్తున్నట్లు తమ ఇంట్రెస్ట్ తెలియజేశారు. దీని తర్వాత స్థానంలో డుంకీ పట్ల కేవలం 76 వేల 7వందల మది మాత్రమే ఇంటరెస్టింగ్ చూపించారు. తరువాత యానిమల్ సినిమాపై 39 వేల 8 వందల మది ఆసక్తి చూపించడం విశేషం. ఈ మూడు చిత్రాలు డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతున్నాయి. ప్రేక్షకుల ఆసక్తి అత్యధికంగా సలార్ సినిమాపైనే ఉందని బుక్ మై షో ఇంట్రెస్ట్ ల ద్వారా స్పష్టం అయ్యింది. సలార్ కి పోటీగా డుంకీ మూవీ రిలీజ్ చేస్తే థియేటర్స్ ఇష్యూ కచ్చితంగా ఉంటుంది. అందుకే షారుఖ్ ఖాన్ అండ్ కో రిలీజ్ డేట్ వాయిదా వేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారంట. ప్రస్తుతానికి అయితే డుంకీ రిలీజ్ డేట్ విషయంలో ఎలాంటి మార్పు ఉండదని ప్రకటనలు అయితే ఇస్తున్నారు. కాని సలార్ మానియా ముందు డుంకీ నిలబడే అవకాశం లేదని బిటౌన్ లో కూడా సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే రాజ్ కుమార్ హిరాణీ పునరాలోచనలో పడ్డారని టాక్ వినిపిస్తోంది.

## మరింత హాట్ గా స్టార్ హీరో రీల్ కూతురు

అజిత్ కూతురు అనగానే చాలా మందికి ఆయన సొంతం పిల్లల కంటే కూడా ముందుగా అనిఖా సురేంద్రన్ గుర్తుకు వస్తుంది అనడంలో సందేహం లేదు. అందుకే అనిఖా ను అజిత్ రీల్ కూతురు అంటూ చాలా మంది పిలుస్తూ ఉంటారు. చిన్న వయసు లోనే ఇండస్ట్రీలో అడుగు పెట్టిన అనిఖా బాల నటిగా పదుల కొద్దీ సినిమాల్లో నటించి మెప్పించింది. అనిఖా పెద్ద అమ్మాయి అయింది. ఇప్పటికే హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. తెలుగు తో పాటు తమిళ్ లో కూడా హీరోయిన్ గా ఈ అమ్మడికి ఆఫర్లు దక్కుతున్నాయి. సాధారణంగా బాల నటిగా అమ్మాయిలకు ఆఫర్లు తక్కువ వస్తూ ఉంటాయి. వారు



ఒకే సారి అందాల ఆరబోత చేస్తే... స్కిన్ షో చేస్తే విమర్శలు వస్తాయి అనే అభిప్రాయం ఉంది. అనిఖా సురేంద్రన్ విషయంలో అలా ఏం జరగలేదు. మెల్ల మెల్లగా కాకుండా అనిఖా రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూనే ఉంది. తాజాగా మరోసారి కవ్వించే చూపులతో నడుము అందాన్ని చూపిస్తూ అనిఖా షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

గతంతో పోల్చితే ఈసారి మరింత అందంగా, హాట్ గా అనిఖా సురేంద్రన్ ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఓ రేంజ్ లో అందాల విందు చేస్తూ దూసుకు పోతున్న అనిఖా సురేంద్రన్ భవిష్యత్తులో స్టార్ హీరోల సినిమా ల్లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. చిన్న వయసు లోనే రెగ్యులర్ కమర్షియల్ హీరోయిన్స్ రేంజ్ లో స్కిన్ షో చేస్తూ దూసుకు పోతోంది.

## ఇంట్రెస్టింగ్: 'టైగర్ 3'లో జూనియర్ ఎన్టీఆర్?

టైగర్ 3కి సంబంధించిన ఒక కీలక అప్ డేట్ బాలీవుడ్ మీడియాలో వేడి పెంచుతోంది. సల్మాన్ ఖాన్ నటించిన స్పై థ్రిల్లర్‌తో ఆర్ఆర్ఆర్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్‌కి భారీ సర్ ప్రైజ్ ఇవ్వబోతున్నాడని, అది హృతిక్ రోషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'వార్ 2'ని చూడటానికి దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఉత్సాహపరుస్తుందని కథనాలొస్తున్నాయి. అయితే ఇందులో నిజం ఎంత? అన్నది ఆరా తీస్తే తెలిసిన సంగతులివి.. కండల హీరో సల్మాన్ ఖాన్ నటించిన 'టైగర్ 3' 2023 దీపావళి సీజన్ లో మోస్ట్ అవైటెడ్ మూవీగా విడుదల కానుంది. టీజర్ ఇటీవలే విడుదలై అభిమానుల్లోకి దూసుకెళ్లింది. అవినాష్ సింగ్ రాథోడ్ పాత్రలో సల్మాన్ ఖాన్ కంబ్యాక్ ఉత్కంఠను పెంచింది. మోస్ట్ అవైటెడ్ 'టైగర్ 3' విడుదల కోసం సల్మాన్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఆసక్తికరంగా 10 నవంబర్ 2023న దీపావళి విడుదలకు ఇంకో నెలరోజులు ఉండగానే, ఫ్యాన్స్ లో టెన్షన్ మరింత పెరుగుతోంది. అంతేకాదు.. టైగర్ 3లో ఒక



బిగ్ సర్ ప్రైజ్ మరింత వేడి పెంచుతుందని అంచనా. వార్ 2లో విలన్‌గా నటిస్తున్న జూనియర్ ఎన్టీఆర్‌ని ఈ సినిమాలో క్లుప్తంగా పరిచయం చేయడానికి ఆదిత్య చోప్రా ప్లాన్ చేసినట్లు ప్రముఖ బాలీవుడ్ మీడియా కథనం వెలువరించడం వేడెక్కిస్తోంది. అంటే ఎన్టీఆర్ డెబ్యూ ఇప్పుడు టైగర్ 3లో ఒక మెరుపులా ఉండనుందని భావించాలి. ఈ వార్త ఇప్పుడు టాలీవుడ్‌లోను ప్రకంపనంగా మారనుంది. 'వార్ 2' ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన తారాగణంలో హృతిక్ రోషన్ – జూనియర్ ఎన్టీఆర్ కాంబినేషన్ సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. గూఢచారి విశ్వంలో వార్ 2 మరో లెవల్ లో ఉండాలని ఆదిత్య చోప్రా ప్లాన్ చేస్తున్నారు. ఇందులో ఎన్టీఆర్ విలన్ పాత్ర ఎంతో ఎగ్జయిట్ చేయనుందని సమాచారం. అలాగే ఈ విశ్వంలో ఆలియా భట్ ప్రధాన లీడ్ లో భారీ స్పై యాక్షన్ చిత్రంతో అనుసంధానించడానికి ప్లాన్ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి సినిమా స్పిన్ ఆఫ్ లో ఇతర సినిమాల పాత్రలను అనుసంధానం చేయడం ద్వారా తదుపరి చిత్రం కోసం ఆసక్తిని పెంచడమే ఈ విశ్వం ప్రత్యేకత. సల్మాన్ ఖాన్ 'టైగర్ 3'లో జూనియర్ ఎన్టీఆర్ పాత్రను కూడా పరిచయం చేయడం వెనక ఒక అద్భుతమైన ఎత్తుగడ ఉంది. ఎన్టీఆర్ ఇప్పుడు పాన్ ఇండియా స్టార్. అతడి పరిచయంతో వార్ 2పై దక్షిణాదిలో గొప్ప ఆసక్తి పెరుగుతుందనేది యష్ రాజ్ ఫిలింస్ ఎత్తుగడ. పైగా ఈ సీజన్ లో ఎంతో క్రేజీగా విడుదలవుతున్న టైగర్ 3తో చాలా ముందుగా ఎన్టీఆర్ ని పరిచయం చేస్తే అది వార్ 2 పై సర్వత్రా ఉత్కంఠ పెంచుతుందని భావిస్తున్నారట. వార్ 2, పఠాన్, టైగర్ నుండి కబీర్ విలన్‌ను కనుగొనే పనిలో ఉంటాడు. ఇది ఆదిత్య చోప్రా సృష్టించిన కలల విశ్వం. ప్రేక్షకులు కచ్చితంగా ఇలాంటి మాయాజాలానికి ముగ్ధులైపోతారు. జూనియర్ ఎన్టీఆర్ వార్ 2తో విలన్‌గా బాలీవుడ్‌లో అరంగేట్రం చేయడం ఇప్పటికే అభిమానుల్లో ఉత్కంఠను పెంచింది. ఇది యూనివర్స్ సినిమాల సమీకరణాన్ని అమాంతం మార్చేయనుంది. ఆర్ఆర్ఆర్ స్టార్ ఎన్టీఆర్ మళ్లీ తనదైన మ్యాజిక్‌ను రిపీట్ చేస్తాడని అభిమానులు భావిస్తున్నారు.




## నడ్డా.. ఈ తెలంగాణ కేసీఆర్ అడ్డా : మంత్రి హరీశ్‌రావు

మంచిర్యాల : బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాపై రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. నడ్డా.. ఈ తెలంగాణ కేసీఆర్ అడ్డా అని మంత్రి తేల్చిచెప్పారు. మంచిర్యాలలో మంత్రి హరీశ్‌రావు వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఇవాళ బీజేపోళు కూడా బాగా మాట్లాడుతున్నారు. నిన్న నడ్డా అని ఒకాయన వచ్చిండు. ఆ నడ్డాకు తెల్వది.. ఈ తెలంగాణ కేసీఆర్ గడ్డా అని గుర్తు పెట్టుకోవాలి. నీ సొంత రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్‌లోనే బీజేపీని గెలిపించుకోలేక పోయావు. నువ్వొచ్చి ఈ తెలంగాణలో ఏం చేస్తవు నడ్డా? తెలంగాణ గడ్డ.. ఇది కేసీఆర్ అడ్డా.. అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

**చేరికల కమిటీ అట్టర్‌ఫ్లాఫ్.. కనీసం డిపాజిట్ల కమిటీ అయినా వేసుకోండి..** సొంత రాష్ట్రంలో బొక్కబొర్లపడ్డా నడ్డా.. తెలంగాణలో బీజేపీని గెలిపిస్త అని మాట్లాడితే.. నీ నాటకాలు నడవవు అని నడ్డాను హరీశ్‌రావు హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీ డకౌటే. బీజేపీ పోయినసారి ఒక్కటి గెలిచింది.. ఇప్పుడు ఆ ఒక్కటి కూడా రాదు గాక రాదు. ప్రపంచంలో లేని కమిటీలు వేస్తున్నవ్ కదా.. డిపాజిట్లు దక్కించుకునే ఓ కమిటీ వేసుకో అని సూచించారు. ఎందుకంటే.. గత ఎన్నికల్లో 100 స్థానాల్లో డిపాజిట్లు రాలేదు.. కనీసం ఇప్పుడు డిపాజిట్లు అయినా వస్తే పరువైనా దక్కుతది. చేరికల కమిటీ అని ఒకటి వేశారు. అది అట్టర్‌ఫ్లాఫ్ అయిపోయింది.

కనీసం డిపాజిట్ల దక్కించుకునే కమిటీ వేసుకొని.. బీజేపీ పరువైనా కాపాడుకోండి అని మంత్రి సూచించారు.

**హంగ్ కాదు.. హ్యాట్రిక్ కొడుతది బీఆర్ఎస్ పార్టీ..** ఇంకొకాయన బీఎల్ సంతోష్ వచ్చి.. ఈ రాష్ట్రంలో హంగ్ వస్తదని అంటుండు.. మిస్టర్ సంతోష్ ఈ రాష్ట్రంలో హంగ్ కాదు.. హ్యాట్రిక్ కొడుతది బీఆర్ఎస్ పార్టీ. కచ్చితంగా కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయితడు అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు. బీఎల్ సంతోష్ కర్ణాటకలో బీజేపీని భ్రష్టు పట్టించిండు.. ఇప్పుడు తెలంగాణలో భ్రష్టు పట్టించేందుకు వచ్చిండు. మంచిదే.. నీలాంటోడు వస్తే అయింత నామరూపాల్లేకుండా పోతది.. మాకేం రంది లేదు.

కానీ హంగ్‌లు గింగ్‌లు రావు.. తెలంగాణలో హ్యాట్రిక్‌లే వస్తయి. మీ గుజరాత్‌లో మూడు మూడు నాలుగు నాలుగు సార్లు గెలవొచ్చు.. కానీ మా కేసీఆర్ తెలంగాణలో మూడు మూడు నాలుగు నాలుగు సార్లు గెలవొద్దా? మీ గుజరాత్ కంటే మా తెలంగాణ పాలన నూరుపాళ్లు నయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



## కమ్మ సామాజికవర్గం వాటా...కాంగ్రెస్ లో కొత్త డిమాండ్

హైదరాబాద్ : ఎన్నికలు అంటే కులాలు మతాలు ప్రాంతాలు అన్నీ మిళితం అయి ఉంటాయి. ఏ కులానికి ఎన్ని సీట్లు ఇవ్వాలని ఎంచి మరీ రాజకీయ పార్టీలు ఇస్తుంటాయి. ఇదిలా ఉంటే కాంగ్రెస్ లో అయితే చాలా పంచాయతీలు ఉంటాయి. కులాల రగడ నుంచి చాలా ఇష్యూస్ ఉంటాయి. ఇపుడు తెలంగాణా కాంగ్రెస్ లో ఒక బలమైన వర్గంగా ఉన్న కమ్మ సామాజికవర్గం తన కోటాగా వాటాగా ఒక నంబర్ చెప్పి సీట్లను డిమాండ్ చేస్తోంది ఈ సీట్లు ఇవ్వాలంటూ ఏకంగా హై కమాండ్ వద్దకు ఢిల్లీకి ఒక టీం బయల్దేరి వెళ్ళింది. కేంద్ర మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రేణుకా చౌదరి నాయకత్వంలో కీలక నేతలు అంతా ఢిల్లీలో తమ సామాజికవర్గానికి సీట్లు కావాలని కాంగ్రెస్ పెద్దలను కోరబోతున్నారు ప్రస్తుతం తెలంగాణాలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సీన్ ఉంది. రెండు మూడు రోజులలో అది రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ లో సీట్ల పంచాయతీ సాగుతోంది. బీయారెస్ అయితే మొత్తం 119 సీట్లకు గానూ 115 సీట్ల దాకా ప్రకటించేసింది. ఇందులో రెడ్లకే 40 సీట్లను కేటాయించడం విశేషం. కమ్మలకు అయిదు ఇచ్చారు బీయారెస్ పెద్దలు, వెలమ సామాజికవర్గానికి 11, బీసీలకు 33 దాకా ఇచ్చారు. కాంగ్రెస్ సైతం సామాజికవర్గాల వారీగా అన్నీ చూసుకుంటూ వస్తోంది. ఈ క్రమంలో కమ్మలకు ఎనిమిది సీట్లు అంటూ ఒక డెలిగేషన్ ఢిల్లీకి వెళ్లడం చూస్తూంటే కాంగ్రెస్ పెద్దలు ఏ నిర్ణయం తీసుకుంటారు అన్నది చూడాల్సి ఉంది అంటున్నారు. ఖమ్మం జిల్లాతో పాటు హైదరాబాద్ లోని సెటిలర్స్ ఎక్కువగా ఉన్న చోట మరి కొన్ని సీట్లు కోరాలని కమ్మ సామాజికవర్గం నేతలు భావిస్తున్నారుట. ఏపీలో చంద్రబాబు అరెస్ట్ తో తెలంగాణాలోని ఆంధ్రా సెటిలర్స్ ఎక్కువగా ఆందోళన చెందారు, నిరసనలు తెలిపారు. ఈసారి వారి ఓట్లు కాంగ్రెస్ వైపు ఎక్కువగా పడతాయని అంతా భావిస్తున్న నేపథ్యం ఉంది. ఈ క్రమంలో కమ్మల నుంచి అభ్యర్ధులను ఎక్కువ మందిని నిలబెడితే మంచి ఫలితాలు వస్తాయన్న అంచనాలు ఉన్నాయి. వారికి తగిన ప్రయారిటీ ఇవ్వాలన్న డిమాండ్ అలా ఊపందుకుంది. దాంతో ఏపీ పరిస్థితులను సానుకూలం చేసుకోవడానికి కాంగ్రెస్ పెద్దలు ఈ డిమాండ్లను నెరవేరుస్తారా అన్న చర్చ కూడా సాగుతోంద్. ఇక రేణుకా చౌదరి నాయకత్వంలోని ఈ ప్రతినిధులు కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే తో పాటు జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణు గోపాల్ ని కూడా కలసి విన్నపాలు చేస్తారని అంటున్నారు. కమ్మ సామాజికవర్గం ఓట్లు గణనీయంగా ఉన్న చోట తమకే సీట్లు ఇవ్వాలని వారు కోరుతున్న పరిస్థితులలో హై కమాండ్ నిర్ణయం మీద అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## రేవంత్‌రెడ్డి గెలిచాక బీజేపీలోకి జంప్ అవుతాడు



కామారెడ్డి : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గెలిచాక బీజేపీలోకి జంప్ అవుతాడని మంత్రి కేటీఆర్ ఆరోపించారు. శనివారం నాడు కామారెడ్డిలో పర్యటించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.."కేసీఆర్ కామారెడ్డిని ఎందుకు ఎంచుకున్నారని రాష్ట్రమంతా చర్చ జరుగుతోంది. 2001లో మొట్టమొదటి జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం గెలుచుకున్నాం. 2004లో పొత్తులో భాగంగా ఇక్కడ షబ్బీర్ అలీ కామారెడ్డి సీటు తీసుకున్నారు. నాడు షబ్బీర్ అలీ బతిమిలాడితేనే కేసీఆర్ ప్రచారానికి వచ్చారు. కామారెడ్డితో కేసీఆరకు ఉన్న అనుబంధం ఈనాటిది కాదు. బీబీపేట మండలంలోని పోసానిపల్లి మా నానమ్మ ఊరు. గంపగోవర్ధన్ కోరిక మేరకే కేసీఆర్ ఇక్కడ పోటీకి సిద్ధమయ్యారు. నెర్రెలు బారిన, నెత్తురు పారిన ఈ నేల సస్యశ్యామలం కావాలని కేసీఆర్ ఇక్కడ పోటీకి చేయబోతున్నారు. కేసీఆర్ ఏది చేసినా సంచలనమే. కేసీఆర్ పేరు ప్రకటించిన మరుక్షణమే గెలుపు ఖరారైంది. ఎమ్మెల్యే టికెట్లు రాని కులాల వారికి నామినేటెడ్ పదవులు కల్పిస్తాం. ఇంట గెలిచి రచ్చ గెలవాలనేది మా సిద్ధాంతం. తెలంగాణలో గెలవగానే మహారాష్ట్రలో గెలిచేలా ప్లాన్ చేసుకుంటున్నాం. దమ్మున్న నాయకుడు కావాలని మహారాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారు. కామారెడ్డిలో మెజార్టీ రికార్డు బద్దలు కొట్టాలి.. దేశం నివ్వెర పోయి చూడాలి. మన పంచాయతీలు పక్కన పెట్టాలి.. అందరూ ఒక్కటి కావాలి.. పాత పగలను పట్టించుకోవద్దు. కామారెడ్డి మేనిఫెస్టో ప్రత్యేకంగా తయారు చేస్తాం. మీరు కోరినవన్నీ తీరుస్తాం. కాంగ్రెస్, బీజేపీ నేతలను తక్కువ అంచనా వేయద్దు. కాంగ్రెస్ నేతలకి కర్ణాటక నుంచి డబ్బులు వస్తాయి. అదానీ పంపే డబ్బులు మోదీ దగ్గర బాగా ఉన్నాయి. బీజేపీది ఉత్త మేకప్.. కాంగ్రెస్ పాకప్. రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి తెలంగాణాకు తీరని ద్రోహం చేశారు. బీఆర్ఎస్ పార్టీ వేగాన్ని తట్టుకోలేక ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నాడు నోటుకు ఓటు.. ఇప్పుడు సీటుకు రేటు. మేము ఎవ్వరికీ బీ టీమ్ కాదు.. ఆ ఖర్మ మాకు పట్టలేదు. ఆరు గ్యారంటీలని ప్రజలె నమ్మరు" అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

## జ్వరం తగ్గింది.. ఛాతీలో ఇన్ ఫెక్షన్.. కేసీఆర్ కు అసలేమైంది?



హైదరాబాద్ : ఆయన సాదాసీదా వ్యక్తి కాదు. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి. అలాంటి ఆయన అనారోగ్యం బారిన పడినప్పుడు దానికి సంబంధించిన వివరాలు అప్పుడప్పుడు బయటకు రావటవేంటి? బయట ప్రపంచానికి కేసీఆర్ కనిపించి మూడోవారంలోకి ఎంట్రీ అయిన వేళ.. ఇప్పటివరకు ఆయన ఆరోగ్యానికి సంబంధించి రెండో ప్రకటన.. అది కూడా మంత్రి కేటీఆర్ నోటి నుంచి యధాలాపంగా రావటం ఏమిటి? ముఖ్యమంత్రికి అనారోగ్యమైతే.. మరీ హైప్ అక్కర్లేదు కానీ సమాచారాన్ని అందించాల్సిన అవసరం ఉంది కదా? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. గతానికి భిన్నంగా పరిస్థితులు మారి.. సమాచారం ఏదైనా సరే బయటకు రావాలంటే.. వివిధ దశల్లో ఫిల్టర్ చేస్తున్న వైనం అంతకంతకూ పెరుగుతోంది. ఇలాంటి వేళ.. అనవసరమైన అనుమానాలు పెరిగే కన్నా.. వాస్తవ పరిస్థితులు ఇవన్న విషయంపై క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉంది కదా? అలాంటిదేమీ లేకపోవటాన్ని తప్పు పట్టాల్సిందే. దాదాపు వారం క్రితం ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అనారోగ్యం గురించి మొదటిసారి మాట్లాడారు. అప్పట్లో ఆయన వైరల్ ఫీవర్ తో బాధ పడుతున్నారని.. ఆయన త్వరలోనే కోలుకుంటారని వెల్లడించారు. రెండు రోజుల క్రితం కేటీఆర్ కుమారుడు హిమాన్షు చేసినట్లుగా ఒక ట్వీట్ వైరల్ అయ్యింది. అందులో మిస్ యు తాతయ్య అని ఉండటం ఒక ఎత్తు అయితే.. అలాంటిదేమీ హిమాన్షు అధికారిక ట్విటర్ (ఎక్స్) ఖాతాలో కనిపించకపోవటం చూస్తే.. ఎవరో కావాలని ఫేక్ పోస్టును వైరల్ చేస్తున్నారని చెప్పాలి. ఇదంతా ఒక ఎత్తు అయితే.. తాజాగా శుక్రవారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్.. ముఖ్యమంత్రి అనారోగ్యం గురించి మరోసారి మాట్లాడారు. వైరల్ ఫీవర్ తో బాధ పడుతున్న కేసీఆర్ కు జ్వరం తగ్గిందని.. ప్రస్తుతం ఛాతీలో ఇన్ ఫెక్షన్ వచ్చిందని పేర్కొన్నారు. వైరల్ ఫీవర్ తర్వాత ఛాతీలో బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్ మొదలైనట్లుగా చెప్పి.. "ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నారు. వేగంగా కోలుకుంటున్నారు. త్వరలోనే ప్రజల ముందుకు వస్తారు" అని చెప్పటం చూసినప్పుడు.. కేసీఆర్ అనారోగ్యం గురించి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తే బాగుంటుంది కదా? అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీలను చేర్చే వరకు పోరాడుతాం: ఎమ్మెల్సీ కవిత




లండన్: భారత రాష్ట్ర సమితి నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత .. లండన్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ కోటాను చేర్చే వరకు తమ పోరాటం ఆగదు అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. లండన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అన్ని వర్గాల మహిళల్ని చేర్చుకోవడమే ముఖ్యమైన విషయమని, అన్ని కులాలు, అన్ని వర్గాలు, అన్ని ఆర్థిక స్థితిగతులకు చెందిన మహిళలను చేర్చాలన్నారు. ఇటీవల పాసైన మహిళా బిల్లులో ఓబీసీ మహిళల్ని చేర్చకపోవడం దురదృష్టకరమన్నారు. భారతీయ సమాజంలో ఓబీసీల వర్గం చాలా పెద్దదని, వారిని ఆ కోటాలో చేర్చే వరకు పోరాటం చేస్తామని ఆమె అన్నారు. బ్రిడ్జ్ ఇండియా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్సీ కవిత లండన్ వెళ్లిన విషయం తెలిసిందే. అక్కడ ఉన్న అంబేద్కర్ మ్యూజియాన్ని ఆమె సందర్శించారు. అంబేద్కర్ ఆశయాలను కేవలం సీఎం కేసీఆర్ మాత్రమే తీర్చగలరన్నారు. భారతీయులతో ఆమె పలు అంశాలపై చర్చించారు.

## తెలంగాణ సమస్యల గురించి మాట్లాడరు కానీ పోటీ చేసుడా పవన్?



హైదరాబాద్ : ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా పదేళ్లు.. జనసేన పార్టీని ఏర్పాటు చేసి పదేళ్లు అయినప్పటికి.. తన లక్ష్యం ఏమిటి? తన గమ్యం మరేమిటి? అన్న విషయంలో పవన్ కల్యాణ్ స్పష్టత ఇవ్వని వైనం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంటుంది. స్పష్టత లేనప్పుడు అస్పష్టతతో ఉండాలన్నట్లుగా ఆయన భావిస్తున్నట్లు చెప్పాలి. కొన్నేళ్లుగా ఏపీ మీద మాత్రమే ఫోకస్ చేసి.. తెలంగాణ అంశాల్ని మాట్లాడటం మానేసి చాలా కాలమే అయ్యింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తన పార్టీ ఉండాలన్న అకాంక్షను వ్యక్తం చేసే పవన్ కల్యాణ్.. ఏపీలోని పరిస్థితుల గురించి తరచూ మాట్లాడేటప్పుడు.. తెలంగాణలో పార్టీ ఉన్న వేళ.. ఒక సందర్భంలో కాకుంటే మరో సందర్భంలో అయినా కనీసం మాట్లాడాల్సిన అవసరం ఉంది. గడిచిన పదేళ్లలో తెలంగాణ ఎదుర్కొంటున్ సమస్యలు.. కేసీఆర్ సర్కారు పాలనలోని అంశాలు.. ఆయన ప్రభుత్వం చేస్తున్న తప్పుల గురించి కనీసం వేలెత్తిచూపించాల్సిన అవసరం ఉంది కదా? కానీ.. అలాంటిదేమీ లేకుండా.. సరిగ్గా ఎన్నికల సమయంలో మాత్రం పోటీ గురించి ప్రస్తావించటం వల్ల ప్రయోజనం ఏముంటుంది? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. ప్రశ్నించేందుకే పార్టీ పెట్టినట్లు చెప్పే పవన్ కల్యాణ్.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి కనీస స్థాయిలో కూడా మాట్లాడలేదని చెప్పాలి. మొత్తం 119 స్థానాలున్న తెలంగాణలో థర్టీ ప్లస్ స్థానాల్లో పోటీ చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. తమ పార్టీ పోటీ చేసే స్థానాల్ని ప్రకటించిన ఆయన.. త్వరలోనే అభ్యర్థుల ప్రకటన ఉంటుందని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తన సత్తా చాటతానని చెప్పిన పవన్ కల్యాణ్.. ఆ తర్వాత ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో తాను పోటీ చేయటం లేదని ప్రకటించటం తెలిసిందే. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం తాము పోటీ చేస్తామని చెప్పే పవన్.. ఏ ప్రాతిపదికన.. ఏయే అంశాల్ని ప్రస్తావిస్తూ ఎన్నికల వేళ.. ప్రజల ముందుకు రానున్నారు? అన్నది ప్రశ్న. తెలంగాణలోచోటుచేసుకున్న ఎన్నో పరిణామాలపై కనీసం స్పందించని పవన్.. ఏ ముఖం పెట్టుకొని తెలంగాణ ప్రజల్ని ఓటు అడిగేందుకు వస్తున్నారన్న ప్రశ్నకు సరైన సమాధానం అవసరమని చెప్పాలి. పవన్ నుంచి ఈ తరహా సమాధానాల్ని ఆశించటం అత్యాశే అవుతుందేమో?

## కేసీఆర్ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోన్న బావ బామ్మర్ధులు

హైదరాబాద్ : సీఎం పదవీ కోసం మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్(బావ బామ్మర్దులు) పోటీపడుతున్నారని బీజేపీ సీనియర్ నాయకురాలు డీకే అరుణ ఎద్దేవ చేశారు. శనివారం నాడు బీజేపీ కార్యాలయంలో అరుణ మీడియాతో మాట్లాడుతూ.."సీఎం కేసీఆర్ ఆరోగ్యాన్ని బావ బామ్మర్ధులు బాగా నిర్లక్ష్యం చేస్తున్నారు. నేనే సీఎం కావాలని కేటీఆర్ ఆరటపడకుండా కేసీఆర్ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. బావ బామ్మర్ధులు ఎన్నికలు వస్తున్నాయని హడావుడి చేస్తున్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిస్తామని, BC బంధు ఇస్తామని అబద్ధాలు చెప్తున్నారు. దళిత బంధులో వచ్చే పైసల్లో 30% బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు వసూలు చేస్తున్నారు. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రజలకు మాయ మాటలు చెప్తున్నారు. వారి ఎన్నికల జిమ్మిక్కులను ప్రజలు నమ్మొద్దు. కేసీఆర్ ఆరోగ్యం బాగాలేక ఫామ్‌హౌస్‌లో ఉంటే ఆయనను పట్టించుకోవడం లేదు. కేసీఆర్ ఆరోగ్యం ఎలా ఉంటే నాకేంటి.. నేను సీఎం కావాలనే ప్లాన్‌లో మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఉన్నారు" అని డీకే అరుణ పేర్కొన్నారు.



## నటుడు నవదీప్‌కు ఈడీ నోటీసులు

హైదరాబాద్: సినీ నటుడు నవదీప్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు ఇచ్చింది. ఈ నెల 10న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. మాదక ద్రవ్యాల కేసులో నవదీప్‌కు ఈ నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవలే మాదాపూర్ డ్రగ్స్ కేసులో నవదీప్‌ను నార్కోటిక్స్ పోలీసులు విచారించిన విషయం తెలిసిందే.

సుమారు 6 గంటల పాటు విచారించిన పోలీసులు.. ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాల్ లిస్ట్ ముందుంచి.. నవదీప్ నుంచి పలు వివరాలను రాబట్టారు. మరోవైపు.. అతడి వాట్సాప్ చాటింగ్‌ను అధికారులు రిట్రీవ్ చేయనున్నట్లు సమాచారం. డేటా అందిన తర్వాత మరోసారి నవదీప్‌ను పోలీసులు విచారించే అవకాశం ఉంది



## నా జీవితంలో ఇదో పండగ రోజు.. : మంత్రి సత్యవతి రాథోడ్

ఈ రోజు నా జీవితంలో పండగ రోజని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహిళా, గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా ఉండడం, రాష్ట్ర అభివృద్ధికి రూ.వేలకోట్లు కేటాయించడం ఒక ఎత్తయితే.. తాను పుట్టిన ప్రాంత అభివృద్ధి నిధులు కేటాయించకోవడం మరొక ఎత్తు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో మంత్రి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే సోయి లేకపోవడంతో అనేక ఇబ్బందులుపడ్డామన్నారు. గతేడాది తన తల్లిదండ్రులను కోల్పోయానని, ఈ ప్రాంత అభివృద్ధి నా బిడ్డ చేసింది అని సంతోషపడే మొదటి వ్యక్తులు తన తల్లిదండ్రులేనన్న మంత్రి.. ఇద్దరు ప్రస్తుతం లేకపోవడం బాధాకరమంటూ భావోద్వేగానికి గురయ్యారు. గత పాలకులు నిర్లక్ష్యం కారణంగా వంతెనలు నిర్మించకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. సీఎం కేసీఆర్ ఈ ప్రాంత అభివృద్ధికి రూ.450కోట్లు కేటాయిస్తే.. ఇందులో రూ.150కోట్లు ఈ ప్రాంతానికి కేటాయించినట్లు మంత్రి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాభివృద్ధికి రూ.400కోట్లతో రోడ్లను అభివృద్ధి చేసుకున్నట్లు పేర్కొన్నారు.

త్వరలోనే పనులన్నీ పూర్తవుతాయన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో మంత్రిగా నేడు పలు నియోజకవర్గాలకు తన శాఖల నుంచి రూ.వేలకోట్లు ఇచ్చే అవకాశం దక్కిందన్నారు. బతుకమ్మ పండగ సందర్భంగా ఆడపడుచులకు ప్రభుత్వం చీరెలను కానుకలుగా ఇస్తుందన్నారు. ఏటా కోటి మందికి రూ.500కోట్లు ఖర్చు చేస్తూ చీరలను అందిస్తుందన్నారు.

## 15 నుంచి ఏడుపాయల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు



పాపన్నపేట: ఏడుపాయల వనదుర్గా భవానీ మాత సన్నిధిలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల15న మొదటి రోజు శరన్నవరాత్రి ఉత్సవాలను అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేందర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అదేరోజు శ్రీశైలపుత్రి (బాలా త్రిపుర సుందరి) అవతారంలో దర్శనం ఇవ్వనున్నారు. రెండో రోజు బ్రహ్మచారిని (గాయత్రీ దేవి)గా, మూడో రోజు చంద్ర గంట (అన్నపూర్ణ) అవతారంలో దర్శనం ఇస్తారు. నాలుగో రోజు కూష్మాండ (వనదుర్గా)గా, ఐదో రోజు స్కంద మాత (మహాలక్ష్మి)గా, ఆరో రోజు షష్టి కాత్యాయని (సరస్వతిదేవి)గా దర్శనమిస్తారు. ఏడో రోజు కాల రాత్రి (దుర్గాదేవి), 8వ రోజు మహా గౌరి సిద్ధి రాత్రి (మహిషాసురా మర్ధిని)గా, చివరి రోజు 9వ రోజు నవమి, దశమి (విజయదశమి) రాజరాజేశ్వరీదేవీగా దర్శనం ఇస్తారని ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి వెల్లడించారు. అక్టోబర్ 20న ఉదయం 11 గంటలకు బోనాల కార్యక్రమం, 22న చండీ హోమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమాలను జయప్రదం చేయాలని భక్తులకు విజ్ఞప్తిచేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com